Follow: @ANNTELUGU
13-10-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 251 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఢిల్లీలో ఇండియా కూటమి ధర్నాలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

- ఢిల్లీలో ఇండియా కూటమి ధర్నాలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి 02
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కంది
- బారాఖంబా మెట్రో వద్ద ధర్నాలో పాల్గొని నినాదాలు



టాప్ న్యూస్

## విజయవాడ, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు ఆ నాలుగు మేయర్ స్థానాలే జనరల్




- 17 మేయర్ స్థానాలు.. 106 మునిసిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్

04

## 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు




- తమిళనాడుకు రాజేంద్ర అర్లేకర్
- కర్నాటకకు సుధా యాదవ్

02

## నేడు బెజవాడకు తమిళనాడు సీఎం విజయ్



- దుర్గమ్మ దర్శనం.. విజయవాడ ఉత్సవ్ కు హాజరు

02



# మోదీ.. నీ ఆట ముగిసింది

## ఢిల్లీలో భగ్గుమన్న రాహుల్ గాంధీ

- ఇండియా కూటమి మార్చ్ కు వేలాదిగా తరలివచ్చిన జనం
- జనం.. రణం.. ఢిల్లీ జనసంద్రం
- ర్యాలీలో ఉద్రిక్తత.. రాహుల్, ప్రియాంక, రేవంత్, డీకే శివకుమార్, అఖిలేష్, సుప్రియా సూలే సహా ర్యాలీలో కీలకనేతలు
- ఇది శివతాండవం.. రేపు మరో రూపంలో ఆందోళన : రాహుల్ గాంధీ
- ర్యాలీపై లాఠీఛార్జి.. తెలంగాణ నేతలకు గాయాలు

**ఢిల్లీ, మహా :**
మోదీ.. నీ గేమ్ ఓవర్. నీ ఆట ముగిసింది అంటూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గర్జించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా, 'ఓట్ల చోరీ' అంశంపై సోమవారం సెంట్రల్ ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు, నేతలు కన్నాట్ ప్లేస్ నుంచి మండి హౌస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'చలో ఢిల్లీ మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో చేపట్టిన ఈ మార్చ్ కారణంగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కన్నాట్ ప్లేస్‌బరాఖంబా రోడ్ జంక్షన్ వద్ద ప్రతిపక్ష నేతలు పెద్ద ఎత్తున గుమిగూడి సుప్రీంకోర్టుకు బయలుదేరారు. ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఎన్నికల సంఘం చీఫ్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలంటూ ప్రతి పక్ష పార్టీల నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల సంఘం మిగతా 2వ పేజీలో




## జ్ఞానేశ్ కుమార్ తొలగింపుపై కేరళం అసెంబ్లీ తీర్మానం

మరో షాకిచ్చిన సీఎం వీడీ సతీశన్ 02

## ఢిల్లీ వదిలి వెళ్లొద్దు : టీ కాంగ్రెస్ నేతలకు రేవంత్ రెడ్డి ఆదేశాలు 03



# ఏసీబీ వలలో అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్, మండల సర్వేయర్



**అబ్దుల్లాపూర్‌మెట్ , మహా :** అబ్దుల్లాపూర్‌మెట్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా ACB, CIU అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మొదట రూ.30 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. లేఅవుట్ కోసం జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేశారు. తహశీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు డబ్బులు స్వీకరిస్తుండగా మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ రెండు చేతుల వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ వచ్చింది. తహశీల్దార్, మండల సర్వేయర్‌ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది.



# ఏపీలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు

**106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల వారీగా రిజర్వేషన్ స్థానాల వివరాలు**

అమరావతి, మహా: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చైర్‌పర్సన్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ విడుదల చేసింది. మొత్తం 106 స్థానాలకు సంబంధించి ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళల సాధారణ కేటగిరీ, రిజర్వేషన్లు లేని విభాగాల వారీగా కేటాయింపులు ప్రకటించింది.

**1. ఎస్టీ మహిళల రిజర్వేషన్ — 1 స్థానం**
1. గూడూరు (నెల్లూరు జిల్లా) — ఎస్టీ మహిళ

**2. ఎస్టీ జనరల్ రిజర్వేషన్ — 2 స్థానాలు**
1. అల్లూరు — ఎస్టీ జనరల్
2. ఆత్మకూరు (కర్నూలు జిల్లా) — ఎస్టీ జనరల్

3. ఎస్సీ మహిళల రిజర్వేషన్ — 7 స్థానాలు
1. చింతలపూడి — ఎస్సీ మహిళ
2. సూళ్లూరుపేట — ఎస్సీ మహిళ
3. కొండపల్లి — ఎస్సీ మహిళ
4. నిడదవోలు — ఎస్సీ మహిళ
5. ఏలేశ్వరం — ఎస్సీ మహిళ
6. గూడూరు (కర్నూలు జిల్లా) — ఎస్సీ మహిళ
7. చీరాల — ఎస్సీ మహిళ

**4. ఎస్సీ జనరల్ రిజర్వేషన్ — 7 స్థానాలు**
1. ఉయ్యూరు — ఎస్సీ జనరల్
2. సామర్లకోట — ఎస్సీ జనరల్
3. పిఠాపురం — ఎస్సీ జనరల్
4. నూజివీడు — ఎస్సీ జనరల్
5. కుప్పం — ఎస్సీ జనరల్
6. పొదిలి — ఎస్సీ జనరల్
7. బాపట్ల — ఎస్సీ జనరల్

**5. బీసీ మహిళల రిజర్వేషన్ — 18 స్థానాలు**
1. ఆళ్లగడ్డ — బీసీ మహిళ
2. సాలూరు — బీసీ మహిళ
3. ఇచ్ఛాపురం — బీసీ మహిళ
4. నర్సీపట్నం — బీసీ మహిళ
5. యర్రగుంట్ల — బీసీ మహిళ
6. జంగారెడ్డిగూడెం — బీసీ మహిళ
7. పాలకొండ — బీసీ మహిళ
8. తుని — బీసీ మహిళ
9. పాలకొల్లు — బీసీ మహిళ
10. కదిరి — బీసీ మహిళ
11. పుంగనూరు — బీసీ మహిళ
12. రాజంపేట — బీసీ మహిళ
13. గుడివాడ — బీసీ మహిళ
14. రాజాం — బీసీ మహిళ
15. గుంతకల్లు — బీసీ మహిళ
16. గూడూరు (కర్నూలు జిల్లా) — బీసీ మహిళ
17. నందికొట్కూరు — బీసీ మహిళ
18. ముమ్మిడివరం — బీసీ మహిళ

**6. బీసీ జనరల్ రిజర్వేషన్ — 18 స్థానాలు**
1. పిడుగురాళ్ల — బీసీ జనరల్
2. పుత్తూరు — బీసీ జనరల్
3. బేతంచెర్ల — బీసీ జనరల్
4. రామచంద్రాపురం — బీసీ జనరల్
5. సత్తెనపల్లి — బీసీ జనరల్
6. శ్రీకాళహస్తి — బీసీ జనరల్
7. మదనపల్లె — బీసీ జనరల్
8. తాడిపత్రి — బీసీ జనరల్
9. తిరువూరు — బీసీ జనరల్
10. నంద్యాల — బీసీ జనరల్
11. హిందూపురం — బీసీ జనరల్
12. మడకశిర — బీసీ జనరల్
13. నెల్లిమర్ల — బీసీ జనరల్
14. పుట్టపర్తి — బీసీ జనరల్
15. పెనుకొండ — బీసీ జనరల్
16. రాయచోటి — బీసీ జనరల్
17. తాడిగడప — బీసీ జనరల్
18. బి.కొత్తకోట — బీసీ జనరల్

**7. మహిళల సాధారణ రిజర్వేషన్ — 27 స్థానాలు**
1. కనిగిరి — మహిళల సాధారణం
2. కమలాపురం — మహిళల సాధారణం
3. కొవ్వూరు — మహిళల సాధారణం
4. వెంకటగిరి — మహిళల సాధారణం
5. బుచ్చిరెడ్డిపాలెం — మహిళల సాధారణం
6. యలమంచిలి — మహిళల సాధారణం
7. కళ్యాణదుర్గం — మహిళల సాధారణం
8. ఆలమూరు (నన్నపనేని ప్రాంతం కాదు; గెజిట్‌లో ఆలమూరు (ఎన్)గా ఉంది) — మహిళల సాధారణం
9. నరసాపురం — మహిళల సాధారణం
10. పలాస కాశీబుగ్గ — మహిళల సాధారణం
11. పెదన — మహిళల సాధారణం
12. పలమనేరు — మహిళల సాధారణం
13. జమ్మలమడుగు — మహిళల సాధారణం
14. ఆకివీడు — మహిళల సాధారణం
15. పొన్నూరు — మహిళల సాధారణం
16. భీమవరం — మహిళల సాధారణం
17. చిలకలూరిపేట — మహిళల సాధారణం
18. జగ్గయ్యపేట — మహిళల సాధారణం
19. అమలాపురం — మహిళల సాధారణం
20. మాచర్ల — మహిళల సాధారణం
21. ఆదోని — మహిళల సాధారణం
22. నాయుడుపేట — మహిళల సాధారణం
23. ధోనే — మహిళల సాధారణం
24. బొబ్బిలి — మహిళల సాధారణం
25. రేపల్లె — మహిళల సాధారణం
26. పార్వతీపురం — మహిళల సాధారణం
27. పులివెందుల — మహిళల సాధారణం

**8. రిజర్వేషన్లు లేని స్థానాలు — 26**
1. తనుకు — రిజర్వేషన్ లేదు
2. తెనాలి — రిజర్వేషన్ లేదు
3. గురజాల — రిజర్వేషన్ లేదు
4. తాడేపల్లిగూడెం — రిజర్వేషన్ లేదు
5. అమలాపురం — రిజర్వేషన్ లేదు
6. ఎమ్మిగనూరు — రిజర్వేషన్ లేదు
7. కావలి — రిజర్వేషన్ లేదు
8. ప్రొద్దుటూరు — రిజర్వేషన్ లేదు
9. నందిగామ — రిజర్వేషన్ లేదు
10. కందుకూరు — రిజర్వేషన్ లేదు
11. మండపేట — రిజర్వేషన్ లేదు
12. దాచేపల్లి — రిజర్వేషన్ లేదు
13. నగరి — రిజర్వేషన్ లేదు
14. చీమకుర్తి — రిజర్వేషన్ లేదు
15. రాయదుర్గం — రిజర్వేషన్ లేదు
16. గిద్దలూరు — రిజర్వేషన్ లేదు
17. వినుకొండ — రిజర్వేషన్ లేదు
18. గొల్లప్రోలు — రిజర్వేషన్ లేదు
19. అద్దంకి — రిజర్వేషన్ లేదు
20. పెద్దాపురం — రిజర్వేషన్ లేదు
21. ధర్మవరం — రిజర్వేషన్ లేదు
22. బుద్వేల్ — రిజర్వేషన్ లేదు
23. దర్శి — రిజర్వేషన్ లేదు
24. మార్కాపురం — రిజర్వేషన్ లేదు
25. మైదుకూరు — రిజర్వేషన్ లేదు
26. నరసరావుపేట — రిజర్వేషన్ లేదు

**రిజర్వేషన్ల మొత్తం వివరాలు**

| రిజర్వేషన్ కేటగిరీ | స్థానాలు |
|---|---|
| ఎస్టీ మహిళ | 1 |
| ఎస్టీ జనరల్ | 2 |
| ఎస్సీ మహిళ | 7 |
| ఎస్సీ జనరల్ | 7 |
| బీసీ మహిళ | 18 |
| బీసీ జనరల్ | 18 |
| మహిళల సాధారణం | 27 |
| రిజర్వేషన్లు లేనివి | 26 |
| మొత్తం | 106 |





# మోదీ.. మీ ఆట ముగిసింది

( మొదటి పేజీ తరువాయి )

తీరును తీవ్రంగా తప్పుబడుతూ విపక్షాలు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశాయి. ఇప్పటికే చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా తో సంప్రదింపులు జరిపారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై తాము సిద్ధం చేసిన పిటిషన్‌ను సోమవారమే సుప్రీంకోర్టులో దాఖలు చేసినట్లు వారి తరఫు న్యాయ బృందం వెల్లడించింది.

**మార్చ్ ను అడ్డుకున్న పోలీసులు**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు పిలుపునిచ్చింది విపక్ష ఇండియా కూటమి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో విపక్ష ఎంపీలు, నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీ అంశంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు లో స్వయంగా పిటిషన్ దాఖలు చేసేందుకు రాహుల్ బృందం బయల్దేరింది. విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. మార్చ్ ను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తోపులాటలో పలువురు తెలంగాణ నేతలకు గాయాలయ్యాయి.

**ఢిల్లీని జైలుగా మార్చారెందుకు..?**

"భాజపా కు దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ ఢిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం ఢిల్లీ ని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్‌ఎస్‌ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ నీ ఆట ముగిసింది.. ఇఇ నీకు కూడా తెలుసంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోదీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు. ఇది మోదీరాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..**

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

**ఇది శివతాండవమే**

ఢిల్లీ: ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ,ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు చేస్తున్న నిరసనల వ్యూహంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం సుప్రీంకోర్టు మార్చ్‌కు ముందు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేస్తున్న నిరసనలకు ఎలాంటి నిర్దిష్ట ప్రణాళిక అవసరం లేదని, ఇది శివుడి తాండవం లాంటిదని అన్నారు. తాము చేస్తున్న పోరాటానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని 'మా సోదరి (ప్రియాంక గాంధీ) నాతో అన్నారు. అందుకు నేను సమాధానంగా.. ఇది 'తాండవం' . దీనికి ఎలాంటి ప్రణాళికలు ఉండవు అని చెప్పాను అని రాహుల్ వెల్లడించారు.

## విజయవాడ, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు
# ఆ నాలుగు మేయర్ స్థానాలే జనరల్

- **17 మేయర్ స్థానాలు.. 106 మునిసిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్**

**అమరావతి, మహా :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాల రిజర్వేషన్లను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్గాల వారీగా మేయర్ పీఠాల కేటాయింపును ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేసింది. ఈ కేటాయింపుల ప్రకారం మొత్తం స్థానాల్లో బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1 మేయర్ స్థానాన్ని కేటాయించారు. అలాగే సాధారణ కేటగిరీలో జనరల్ మహిళలకు 5 స్థానాలు దక్కగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ రొటేషన్ విధానంలో స్థానాలుగా నిర్ధారించారు.

కార్పొరేషన్ల వారీగా లెక్కలు ఇలా..

వివిధ కార్పొరేషన్ల కేటాయింపులను చూస్తూ మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని ఎస్టీ కేటగిరీకి కేటాయించగా, రాజమండ్రి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లను ఎస్సీ వర్గానికి కేటాయించారు. బీసీ కేటగిరీకి కేటాయించిన స్థానాల్లో మచిలీపట్నం, కాకినాడ కార్పొరేషన్లను బీసీ మహిళలకు ప్రత్యేకించగా.. అనంతపురం, ఏలూరు, చిత్తూరు మేయర్ స్థానాలను బీసీ జనరల్‌కు కేటాయించారు. అదేవిధంగా విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, వైఎస్సార్ కడప, గ్రేటర్ విశాఖపట్నం స్థానాలను జనరల్ మహిళలకు కేటాయించారు. తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్లను అన్‌రిజర్వ్‌డ్ స్థానాలుగా ఖరారు చేస్తూ ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

**విజయనగరం - జనరల్ మహిళ**
**శ్రీకాకుళం - జనరల్ మహిళ**
**గుంటూరు - జనరల్ మహిళ**
**కడప - జనరల్ మహిళ**
**విశాఖ - జనరల్ మహిళ**
**తిరుపతి - అన్‌రిజర్వ్‌డ్**
**విజయవాడ - అన్‌రిజర్వ్‌డ్**
**ఒంగోలు - అన్‌రిజర్వ్‌డ్**
**నెల్లూరు - అన్‌రిజర్వ్‌డ్**
**మంగళగిరి తాడేపల్లి - ఎస్టీ**
**రాజమహేంద్రవరం - ఎస్సీ**
**కర్నూలు - ఎస్సీ**
**మచిలీపట్నం - బీసీ మహిళ**
**కాకినాడ - బీసీ మహిళ**
**ఏలూరు - బీసీ జనరల్**
**అనంతపురం - బీసీ జనరల్**
**చిత్తూరు - బీసీ జనరల్**

# 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు



**ఢిల్లీ:** దేశంలోని 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం రోజు నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు, కేరళం, సిక్కిం రాష్ట్రాల గవర్నర్లను బదిలీ చేయడంతో పాటుగా ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. సంబంధిత గవర్నర్లు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా మార్పుల్లో భాగంగా కేరళం గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు మారుస్తూ అక్కడ పూర్తి బాధ్యతలు అప్పగించారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్నటువంటి ఓం ప్రకాశ్ మాథుర్ కేరళంకు బదిలీ అయ్యారు. సిక్కిం గవర్నర్‌గా బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు. బ్రజ్ మోహన్ రామ్ ఒడిశా గవర్నర్‌గా , డాక్టర్ సుధా యాదవ్ కర్ణాటక గవర్నర్‌గా , డాక్టర్ ధల్ సింగ్ బిసెన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు.

# జ్ఞానేశ్ కుమార్ తొలగింపుపై కేరళం అసెంబ్లీ తీర్మానం

**తిరువనంతపురం**: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ కేరళం అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని పాస్ చేసింది. భారత ఎన్నికల సంఘంలో పారదర్శకత తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అధికార కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), ప్రతిపక్షం సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) మద్దతు తెలిపాయి. కాగా.. తీర్మానంలోని పలు అంశాలపై బీజేపీ అభ్యంతరం తెలిపింది. వాటికి సవరణ చేయాలని బీజేపీ నేతలు కోరగా వాటిని తిరస్కరించారు. సీఈసీపై వచ్చిన ఆరోపణలపై సభ ఆందోళన వ్యక్తం చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, అలా నిర్వహించిన ఎన్నికలపైనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని సభ పేర్కొంది. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పారదర్శకతపై సందేహాలు వస్తున్న నేపథ్యంలో ఆ రాజ్యాంగబద్ధ వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి సీఈసీని తొలగించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని తీర్మానం పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో లోపాలను పరిష్కరించాలని, అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీఐని సభ కోరింది. అలాగే, సీఈసీని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. సీఈసీ ఎంపికలో ప్రధాన మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేతతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానం పేర్కొంది. 'సరైన విధానాన్ని అనుసరించకుండానే ఓటరు జాబితా నుంచి కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. బడుగు బలహీనవర్గాలు, మైనారిటీలు, యువత, కార్మికుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాయడమే. అలాగే, ఓటర్ల జాబితాను తయారు చేయడానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల అధికారాలను కూడా తగ్గించారని మీడియాలో కథనాలు వచ్చాయి. ఫామ్ 6కు సవరణలు చేశారని, దీనిపై ఇద్దరు ఎన్నికల అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని పత్రికలు ప్రచురించాయి' అని తీర్మానం వ్యాఖ్యానించింది. కాగా ఇప్పటికే పాత ఆత్మహత్య కేసును తిరగదోడిన కేరళం సర్కార్ ఇపుడు తాజా తీర్మానంతో జ్ఞానేశ్ కు మరో షాకిచ్చింది.

# నేడు బెజవాడకు తమిళనాడు సీఎం విజయ్

**విజయవాడ, మహా:** నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ వారిని తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ దర్శించుకోనున్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి సోమవారం ఇంద్రకీలాద్రికి సీఎం భద్రతా సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ రూట్ మ్యాప్‌ను వారు పరిశీలించారు. మరో వైపు ఏపీలో సీఎం విజయ్ పర్యటన షెడ్యూల్‌ను తమిళనాడు సీఎం కార్యాలయం విడుదల చేసింది. ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు రావాలంటూ తమిళనాడు సీఎం జోసఫ్ విజయ్‌ను ఏపీ టీడీపీ ఎంపీలు స్వయంగా కలిసి ఆహ్వానించారు. ఇటీవల చెన్నైలో సీఎం విజయ్‌ను ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జీఎం హరీశ్ బాలయోగి కలిసిన సంగతి తెలిసిందే. సాయంత్రం 4గంటలకు రానున్న విజయ్ దుర్గమ్మ దర్శనం అనంతరం చంద్రబాబు నివాసానికి వెళ్తారు. నదుల అనుసంధానంపై చర్చల అనంతరం విజయవాడ ఉత్సవ్ లో పాల్గొని ప్రసంగిస్తారు. రాత్రి 8గంటలకు తిరిగి చెన్నై వెళ్తారు.

# ఢిల్లీలో ఇండియా కూటమి ధర్నాలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా** : దేశంలో ఓట్ చోరీ ఎన్నికల కమిషన్ తీరుపై ఇండియా కూటమి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో కలిసి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఏఐసీసీ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నాయకులు ,ఎంపీ రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఆయన ఢిల్లీ తరలివెళ్లారు. ఢిల్లీ బారాఖంబా జంక్షన్‌లో కాంగ్రెస్ ప్రముఖుల తో కలిసి రోడ్డు పై బైఠాయించి సీఈసీ తీరుకు నిరసన తెలిపారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌ను ప్రక్షాళన చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా కలిసిన కంది శ్రీనివాసరెడ్డి తమ నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ని రోజులైనా ఆందోళలను కొనసాగిస్తామన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన మోదీ సర్కార్ పతనం తథ్యమన్నారు.

# ఢిల్లీ వదిలి వెళ్లొద్దు

**టీ కాంగ్రెస్ నేతలకు రేవంత్ రెడ్డి ఆదేశాలు**

**ఢిల్లీ, మహా :** తెలంగాణ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పేంత వరకు ఢిల్లీ వదిలి వెళ్లొద్దని నేతలకు స్పష్టం చేశారు. సీఈసీ నిర్ణయాలు, సర్ అంశాలపై ఇండియా కూటమి నేతలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివెళ్లారు. పోరాటం మరికొన్ని రోజులు జరగనున్నందున వెళ్లిన వారంతా అక్కడే ఉండాలని సీఎం, పీసీసీ చీఫ్ ఆదేశించారు. మరోవైపు సోమవారం నిర్వహించిన ఇండియా కూటమి ర్యాలీలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటు చేసుకుంది. పలువురు తెలంగాణ రాష్ట్ర నేతలు కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. కాగా తెలంగాణ నుండి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు అంతా ఢిల్లీ బాట పట్టారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆదిలాబాద్ జిల్లా నేతలతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్రగా ర్యాలీలో కదం తొక్కగా, సీఎం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ క్యాడర్‌లో ప్రత్యేక ఆకర్షణగా మారారు.




# వృద్ధుడి హత్య కేసులో కేర్ టేకర్ అరెస్ట్

- రాగి కడియంతో దాడి చేసి హతమార్చిన వైనం
- వివరాలు వెల్లడించిన ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు

**వరంగల్, క్రైం మహా ;** వరంగల్ నగరం లోని మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన వృద్ధుడి హత్య కేసులో నిందితుడిని మట్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటన వివరాలు.. వరంగల్ శాంతి నగర్, బ్యాంక్ కాలనీ 2 లోని 1124142 నివాసంలో ఈ దారుణం చోటుచేసుకుంది. రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (మున్సిపాలిటీ) కోలిపాక వెంకటస్వామి (75) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు కోలిపాక శ్రావణ్ కుమార్ యూఎస్ఎ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగి.వృద్ధుడి సంరక్షణ కోసం కుటుంబ సభ్యులు భీమారం లోని 'రామ్ కేర్ టేకర్ సర్వీసెస్' ద్వారా నిట్ట రాంబాబు, శాంత అనే ఇద్దరు కేర్ టేకర్లను నియమించుకున్నారు. సెప్టెంబర్ 1, 2026 న సాయంత్రం 7 00 నుండి రాత్రి 8 30 గంటల మధ్య కేర్ టేకర్లు రాంబాబు, శాంతల మధ్య గొడవ జరిగింది. దీంతో వారి సేవలు అవసరం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు నిట్ట రాంబాబు మద్యం మత్తులో వృద్ధుడైన వెంకటస్వామిని కిందకు తోసి, రాగి కడియం తో తలపై, ప్రక్క ఎముకల పై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తాడు. అనంతరం నేరాన్ని కప్పిపుచ్చేందుకు రక్తపు మరకలను తుడిచివేసి, రక్తం అంటిన బనియన్ ను పారవేసి, వృద్ధుడు కిందపడి గాయపడ్డాడని సెక్యూరిటీ గార్డు కు, కుటుంబ సభ్యులకు అబద్ధం చెప్పాడు. తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని మొదట వరంగల్ లోని అజారా ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్టోబర్ 9, 2026న ఉదయం 6 గంటలకు ఆయన మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్వాడ పోలీసులు సెప్టెంబర్ 08, 2026 న రాత్రి 22:20 గంటలకు కేసు నమోదు చేశారు. బాధితుడు మృతి చెందడంతో పోలీసులు కేసును సెక్షన్ 109 బిఎన్ఎస్ నుండి సెక్షన్ 103(1) తో పాటు 238 బిఎన్ఎస్ కిందకు మార్చారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు నిట్ట రాంబాబు (46) ను అక్టోబర్ 11, 2026 న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద మట్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి హత్యకు ఉపయోగించిన రాగి కడియాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తెలిపారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**ఢిల్లీలో వరంగల్ ప్రజాప్రతినిధుల నిరసన**

**హనుమకొండ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలోని బరాఖంబా మెట్రో స్టేషన్ వద్ద ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి మహమ్మద్ అయూబ్, తో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కలెక్టరేట్,మహా :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలు, మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మండలాల వారీగా భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలు, భూ రీసర్వే అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, భూములు కొలతలు శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇప్పటి వరకూ పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తులు, భూముల రీ సర్వే వివరాలను తహసీల్దార్లు, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. భూభారతి దరఖాస్తులు పెండింగ్ లో ఉండొద్దన్నారు. అదేవిధగా భూముల రీసర్వే ను మరింత వేగవంతం చేయాలని భూములు కొలతలు శాఖ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు అందుబాటులో ఉన్న రోవర్లతో సర్వే ను గ్రామాలలో పూర్తి చేసేవిధంగా సర్వేయర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, భూములు కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# రైతు కూలీలకు డబ్బులివ్వడానికి కాంగ్రెస్‌కు మనసు రావడం లేదా?

**బీసీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీసిన మాజీ మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సాగునీటి సమస్యలు, రైతు కూలీల ఆర్థిక దుస్థితి, పంటల సాగుపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు కూలీలకు ఆర్థిక సాయం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో యాసంగిలో పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వ తీరు వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు ఎలా జీవించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. సాగునీరు అందుబాటులో ఉన్నప్పటికీ, అవసరమైన చోట వినియోగించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.రైతు కూలీలకు డబ్బులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మనసు రావడం లేదని విమర్శించిన హరీశ్‌రావు.. పంటలు సాగు చేయవద్దని సూచిస్తే వ్యవసాయంపై ఆధారపడిన కూలీల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని, బతుకుదెరువు కోసం మళ్ళీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వలస వెళ్లిన వారు తిరిగి స్వగ్రామాలకు వచ్చారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మళ్లీ వలసల పర్వం ప్రారంభమైందని ఆరోపించారు

# సింగరేణి బాధితులకు న్యాయం చేస్తాం!

- అంబేడ్కర్‌నగర్ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీపై ఉప ముఖ్యమంత్రి సానుకూలత
- సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ మల్టీ స్పెషాలిటీ స్థాయికి తీర్చిదిద్దేందుకు సింగరేణి నిధులు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడి



**సత్తుపల్లి, అక్టోబరు 12:మహా :** సింగరేణి సంస్థ వల్ల నష్టపోతున్న కిష్టారం అంబేడ్కర్‌నగర్ కాలనీ ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. బాధితులకు స్థలం సేకరించి పునరావాసం, పునరుద్ధరణ ప్యాకేజీ (ఆర్అండ్ఆర్) అందించే అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

**కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వ అండ**

దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులు, అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తూ బోనస్ అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో సింగరేణి అధికారులకు మాత్రమే బోనస్‌లు ప్రకటించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు సైతం బోనస్ అందిస్తోందని తెలిపారు. దసరాలోగా సింగరేణి అధికారులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టం చేసినట్లు చెప్పారు.

**సింగరేణి బ్లాక్-3పై దృష్టి**

సింగరేణి బ్లాక్ 3 సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని, ఆ బ్లాక్‌ను సింగరేణి సంస్థకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రిని కోరినట్లు రాగమయి తెలిపారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక వైద్యం**

సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో సూపర్ మల్టీ స్పెషాలిటీ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సింగరేణి సంస్థ ద్వారా నిధులు కేటాయించే అంశంపై సానుకూలత వ్యక్తమైందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సింగరేణి సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి కోటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చలగళ్ల నరసింహారావు, కౌన్సిలర్ ఉప్పు నాగమణి సింగరేణి కార్మికులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

# మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ చెబుత్ర

- మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి
- 10 బైక్ లు స్వాధీనం, 28 మంది పై కేసులు నమోద



**ఖిలా వరంగల్, మహా :** వరంగల్ పోలీస్ కమిషనర్ యన్.శ్వేత ఐపిఎస్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ చెబుత్ర" నిర్వహించి 10 బైక్ లు స్వాధీనం చేసుకొని, 28 మందిని అదుపులోకి తీసుకున్నారు, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మిల్స్ కాలనీ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించడం, న్యూసెన్స్ సృష్టించడం వంటి కార్యకలాపాలను నియంత్రించే లక్ష్యంతో నిర్వహించే "ఆపరేషన్ చెబుత్ర" కార్యక్రమాన్ని తేదీ 11 10 2026 రాత్రి అజాంజాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, వరంగల్ పరిధిలో నిర్వహించడం జరిగింది. ఈ ఆపరేషన్ లో భాగంగా చింతల్, అబ్బనికుంట, లేబర్ కాలనీ, ఫోర్ట్ వరంగల్, శివనగర్, ఎస్.ఆర్.ఆర్. తోట, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు, శంభునిపేట, రంగశాయిపేట తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న 28 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అందులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి దొరికిన 15 మంది పైన సీపి యాక్ట్ సెక్షన్ 70(ఎ) కింద కేసులు నమోదు చేశారు. మరో 13 మందిపై ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ న్యూసెన్స్ కు పాల్పడినందుకు సీపీ యాక్ట్ సెక్షన్స్ 21, 70, 76 కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్ లో భాగంగా 10 మోటార్ సైకిళ్లు, 24 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదేవిదంగా అదుపులోకి తీసుకున్న 28 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ కూడా నిర్వహించారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, న్యూసెన్స్ కు పాల్పడటం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వారికి వివరించారు. ఆపరేషన్ చెబుత్ర ఓ నిరంతర ప్రక్రియ అని, ఇకనుండి ఈ కార్యక్రమం ప్రతిరోజూ కొనసాగుతుందని, ప్రజలు రాత్రి వేళలో అవసరమైతే తప్ప బయట తిరుగవద్దని , శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ ప్రత్యేక ఆపరేషన్ లో మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి తో పాటు ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్ లు మంగిలాల్, ఎస్. శ్రీనివాస్, ఐ శ్రీనివాస్, శ్యాంసుందర్, పలువురు ఎస్సైలు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, త్వరిత స్పందన బృందం ఇతర పోలీసు సిబ్బంది మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నపూర్ణేశ్వరి గా శ్రీ భద్రకాళీ అమ్మవారు



**రంగంపేట, మహా :** కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవములు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 400 గంటలకు నిత్యాహ్నికం నిర్వర్తించిన తదుపరి అర్చకులు అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి బ్రహ్మాచారిణి, సాయంకాలం దేవజా దుర్గా క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఉదయం మకర వాహన సేవ, సాయంకాలం చంద్రప్రభ వాహన సేవ పై ఊరేగించారు. నవదుర్గా క్రమంలోని బ్రహ్మాచారిణి దుర్గా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకుల దృష్టిని శరీరంలోని స్వాధిష్టానచక్రం మీద కేంద్రీకరింపజేసి సాధకుడిని విష్ణుమూర్తి అనుగ్రహానికి పాత్రులను చేసి అధికారం, జ్ఞానం రెండింటినీ ప్రసాదిస్తుంది. దేవజా దుర్గా సమస్త దేవతా కోపసంభూత, సాధకుడిని బాధిస్తున్న అసురీ శక్తులను దునిమి పారేస్తుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. మకర వాహనం పై అమ్మవారిని గంగాభవాని గా , చంద్రప్రభ వాహనం మీద అమ్మవారిని రాజరాజేశ్వరి గాను అలంకరించారు. మూడవ రోజు మంత్ర దీక్షకు సంకేతంగా అమ్మవారిని గాయత్రి గా అలంకరిస్తే ఆ మంత్ర దీక్షకు ముందు రెండవ రోజు సాధకుడి తల్లితో సహా భోజనం పెడతారు, దానికి సంకేతంగా రెండవ రోజు అన్నపూర్ణేశ్వరి గా అమ్మవారిని అలంకరించడం జరిగిందని ఈ అన్నపూర్ణేశ్వరి అలంకారంలో వున్న అమ్మవారిని దర్శించడం వల్ల ఆకలి బాధలు దరిచేరవు. భక్తులకు మృష్టాన్నప్రాప్తి కలిగి అధిక కాలం సాధన కొరకు వెచ్చించే బుద్ధి ఏర్పడుతుంది. అనంతరం మహిళలు దేవాలయ మహా మండపంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయని ఆలయ ఈవో రామల సునీత తెలిపారు.



# పవన్ ఇలాకాలో ఆశా వాహులకు బిగ్ షాక్

- పిఠాపురం మున్సిపాల్టీకి ఎస్సీ.. గొల్లప్రోలుకు ఓసీకి కేటాయింపు
- జనసేన నేతల లెక్కలు తారుమారు..అభ్యర్థుల కోసం మొదలైన వేట
- పోటీలో వైద్యులు.. విద్యా సంస్థల నేత

**మహా కాకినాడ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇలాకాలో అంచనాలు తారుమారయ్యాయి. ముఖ్యంగా ఆయన ఎమ్మెల్యేగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో అనుకున్న స్థానాలు దక్కకపోవడంతో ముఖ్య నేతలు గందరగోళంలో పడ్డారు. ప్రస్తుతం ఏర్పడ్డ రిజర్వేషన్ల అభ్యర్థుల కోసం వేట మొదలుపెట్టారు. కాకినాడ జిల్లాలో ఉన్న మున్సిపాల్టీల్లో అతిముఖ్యమైన పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఈసారి రిజర్వేషన్ల ఎంపిక లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఇక్కడ ప్రధానంగా ఉన్న పిఠాపురం మున్సిపాల్టీలో ఎక్కువ మంది నేతలు, ఆశావాహులు అన్ రిజర్వ్‌డ్ స్థానాన్ని ఆశించారు. మరికొంత మంది బీసీ నేతలైతే బీసీకి ఛైర్‌పర్సన్ స్థానాన్ని కేటాయించారని, పక్కాగా పోటీలో ఉంటున్నామని ప్రచారం కూడా చేసుకున్నారు. కానీ ఇక్కడ పరిస్థితి తారుమారైంది. పిఠాపురం మున్సిపాల్టీ కి ఎస్సీ జనరల్ స్థానాన్ని కేటాయిస్తూ గెజిట్ విడుదల చేశారు. దీంతో ఆశావాహులకు మింగుడు పడటం లేదు. పిఠాపురం మున్సిపాల్టీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలు ఢీలా పడిపోయారు. పిఠాపురం ఎస్సీ జనరల్ స్థానంలో అభ్యర్థి కోసం వెతుకులాట మొదలుపెట్టారు. గొల్లప్రోలు మున్సిపాల్టీలో కూడా కొంత మంది నేతలు, ఎస్సీ, బీసీ స్థానాలకు కేటాయిస్తారని అనుకున్నారు. ఓ ప్రధాన పత్రికలో గొల్లప్రోలుకు బీసీ జనరల్ కేటాయించారని మంగళవారం ప్రచురణ కూడా చేశారు. అయితే మంగళవారం సాయంత్రం విడుదలైన గెజిట్ లో గొల్లప్రోలు అన్ రిజర్వ్‌డ్ స్థానం కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో అప్పటి వరకూ ఆశలు పెట్టుకున్న బీసీ, ఎస్సీ నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లైయ్యింది. గొల్లప్రోలులో ఓసీ వర్గానికి చెందిన ఓ విద్యా సంస్థ అధినేత రేసులో ఉంటారని ప్రచారం జరుగుతోంది.

**పిఠాపురం రేసులో వైద్యులు**

పిఠాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఎస్సీ జనరల్ కు కేటాయించడంతో ఆరేసులో కొందరు వైద్యులు ఉన్నట్లు సమాచారం. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో గతంలో పనిచేసిన ఓ వైద్యుడితోపాటు, ప్రస్తుతం ఇక్కడే యుపీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న యువ వైద్యుడిపేరు తెరపైకి వచ్చింది. అలాగే పిఠాపురంలో చిన్నపిల్లల వైద్యుడు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ గా ఉన్న దానం లాజర్‌బాబు పేరు, ఎస్సీ నాయకుడు బి.ఎన్.రాజు పేరు కూడా పరిశీలనలో ఉంది. కొంత మంది జనసేనలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. కొత్తపేర్లు తెరపైకి వస్తున్న నేపథ్యంలో పిఠాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- మృతదేహాన్ని భుజాలపై మోసిన కానిస్టేబుల్!
- తుంగభద్ర నదిలోకి దిగి మహిళ మృతదేహాన్ని వెలికి తీసిన వైనం
- కిలోమీటరు దూరం భుజాలపై మోసుకొచ్చి విధి నిర్వహణలో మానవీయ కోణం
- కానిస్టేబుల్ రంగస్వామిపై ప్రశంసల జల్లు



మంత్రాలయం: విధి నిర్వహణ అంటే కేవలం బాధ్యతలను నిర్వర్తించడమే కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, చివరి క్షణాల్లోనూ మానవత్వాన్ని చాటుకోవడం. కర్నూలు జిల్లా మంత్రాలయంలో తుంగభద్ర నది సాక్షిగా ఓ పోలీసు కానిస్టేబుల్ చేసిన పని పలువురి హృదయాలను కదిలిస్తోంది. నదిలో దూకి ప్రాణాలు కోల్పోయిన ఓ మహిళ మృతదేహాన్ని వెలికి తీసిన ఆయన, దాదాపు కిలోమీటరు దూరం తన భుజాలపై మోసుకొచ్చారు. విధి పట్ల అంకితభావంతో పాటు మానవీయ విలువలను చాటుకున్న కానిస్టేబుల్ రంగస్వామిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**అనారోగ్య బాధలతో విషాదాంతం**

కర్ణాటక రాష్ట్రం చామరాజనగర్ ప్రాంతానికి చెందిన మహేశప్ప భార్య జయశీల (41) కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తిరిగి వెళ్లగా, శ్రీమఠంలో సేవ చేసుకుంటానని ఆమె అక్కడే ఉండిపోయారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తుంగభద్ర నది తీరానికి చేరుకున్న జయశీల.. తన భర్త మహేశప్ప, కుమార్తె అమూల్యకు ఫోన్ చేసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఆమెను వారించే ప్రయత్నం చేసినప్పటికీ, నదిలోకి దూకడంతో విషాదం చోటుచేసుకుంది.

**ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నం**

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. శ్రీమఠం ప్రోటోకాల్ కానిస్టేబుల్ రంగస్వామి ఘటనా స్థలానికి చేరుకున్నారు. నది మధ్యలో జయశీల కనిపించడంతో ఏమాత్రం వెనుకాడకుండా నీటిలోకి దిగి ఆమెను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందడంతో ప్రాణాలు కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

**భుజాలపై మోసుకొచ్చి..**

నది మధ్యలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చడం సవాలుగా మారింది. ఈ పరిస్థితుల్లో కానిస్టేబుల్ రంగస్వామి స్వయంగా బాధ్యత తీసుకుని, మృతదేహాన్ని దాదాపు కిలోమీటరు దూరం తన భుజాలపై మోసుకొచ్చారు. ఆ సమయంలో ఆయన చూపిన చొరవ, బాధ్యత పట్ల నిబద్ధత పలువురిని కదిలించాయి. మృతదేహాన్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు ఆయన చేసిన ప్రయత్నానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికులు, నెటిజన్లు ఆయనను అభినందిస్తున్నారు.

**మానవత్వమే నిజమైన సేవ**

ఓ కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటనలో కానిస్టేబుల్ రంగస్వామి చూపిన మానవత్వం ప్రత్యేకంగా నిలిచింది. విధి నిర్వహణలో భాగంగా స్పందించినప్పటికీ, మృతదేహాన్ని గౌరవంగా ఒడ్డుకు చేర్చేందుకు ఆయన చేసిన కృషి పోలీసు శాఖలోని మానవీయ కోణాన్ని చాటిచెప్పింది. జయశీల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయి?

## కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ధ్వజం

న్యూఢిల్లీ, మహా : దేశంలో జనాభా అంతకంతకూ పెరుగుతున్నప్పటికీ, ఓటర్ల జాబితా నుంచి కోట్ల సంఖ్యలో ఓట్లు ఏవిధంగా తగ్గిపోతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముసుగులో ఓటు హక్కును హరించే పెద్ద కుట్ర జరుగుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్న రేవంత్ రెడ్డి కేంద్ర తీరుపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014లో దేశంలో 81 కోట్ల ఓట్లు ఉండగా, 2019 నాటికి 91 కోట్లకు, 2023 నాటికి 97 కోట్లకు చేరాయని, కానీ ఇప్పటివరకు సుమారు 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను జాబితా నుంచి అకారణంగా తొలగించారని ఆరోపించారు. జనాభా పెరుగుతున్న తరుణంలో ఓట్లు తగ్గడం వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న సామాన్య ప్రజలు, యువత ఓటు హక్కును కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి తొలగిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రధాని మోదీ విధానాలను ప్రశ్నించే వారి పేర్లను లక్ష్యంగా చేసుకుని జాబితా నుంచి గల్లంతు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయనపై ప్రతిపక్షాలు స్పష్టమైన ఆరోపణలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఈసీ నియామక ప్రక్రియలోంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గతంలో జరిగిన స్వతంత్ర పోరాటంలాగే, దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఓటు హక్కు పరిరక్షణ కోసం మరో పెద్ద పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.
















## బ్యాట్‌మన్ మాస్కులతో రాహుల్ గాంధీ

### ఢిల్లీలో కాంగ్రెస్ వినూత్న ప్రచారం

**ఢిల్లీ, మహా :** సాధారణంగా గోతమ్ సిటీని కాపాడే సూపర్‌హీరో బ్యాట్ మన్ గురించి ఇప్పుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఇండియా కూటమి చేపట్టిన 'ఛలో ఢిల్లీ' మార్చ్‌లో బ్యాట్ మన్ మాస్కులు ప్రత్యేకాకర్షణగా నిలవడమే ఇందుకు కారణం. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నేతలు పంపిణీ చేసిన ఈ మాస్కులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుకుని ఫొటోలకు పోజులిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాహుల్ మాస్క్ ధరింపజేయడం మరింత ఆసక్తికరంగా మారింది. ఈ పోస్టులను ఎన్ఎస్‌యూఐ ఎక్స్‌లో షేర్ చేసింది.







# పెద్దపల్లిలో సమస్యలు పరిష్కరించండి..

- **ప్రజావాణిలో ఏఐఎఫ్‌బీ నాయకుల వినతి**
- **ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి పారిశుద్ధ్య కార్మికుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి**

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎఫ్‌బీ నాయకులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందని పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. కమాన్ కూడలి, కునారం రోడ్డు కూడలి ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేయడం వల్ల కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్లే భారీ వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయని, దీంతో రోడ్డు దాటే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ కోన్స్‌ను తొలగించి, సంబంధిత కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. తద్వారా ప్రమాదాలను నివారించి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, నిరుపయోగంగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల విగ్రహాలను జెండా కూడలిలో ఏర్పాటు చేసి, వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ నాయకులు కుక్క అశోక్, మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక గర్జనను

# విజయవంతం చేయాలి..

- **ఈ నెల 14న గోదావరిఖనిలో భారీ బహిరంగ సభ..**
- **హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి పిలుపు**



**మణుగూరు, మహా** : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పీవీ కాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖని సింగరేణి గ్రౌండ్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘం కేంద్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

**కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటా ఇవ్వాలి**

ప్రాణాలకు తెగించి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి కార్మికులకు సంస్థ వాస్తవ లాభాల నుంచి 36 శాతానికి పైగా వాటా ప్రకటించి వెంటనే ఖాతాల్లో జమ చేయాలని నాగెల్లి డిమాండ్ చేశారు. దసరా పండుగ సమీపిస్తున్నా లాభాల వాటా ప్రకటనలో జాప్యం చేయడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో అమలైన మెడికల్ బోర్డు ద్వారా కారుణ్య నియామకాల ప్రక్రియను కొనసాగించాలని, జీవో 76 అమలు చేయాలని, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంతో పాటు సంస్థను ప్రైవేటీకరణ ముప్పు నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కార్మిక సంఘాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్మికుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన కొన్ని సంఘాలు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని నాగెల్లి ఆరోపించారు. కార్మిక గర్జన సభను కేటీఆర్ ప్రకటించినప్పటి నుంచే ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెరిగిందని అభిప్రాయపడ్డారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి పరిరక్షణ కోసం టీబీజీకేఎస్ పోరాటాలను ఉధృతం చేస్తుందని తెలిపారు. రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మణుగూరు ఏరియాలోని సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్‌కుమార్, జంగం రాజ్‌కుమార్, మస్తాన్, సాంబార్ రాజశేఖర్, వర్క్‌షాప్ శ్రీనివాసరెడ్డి, జర్పుల రాము, అజ్మీరా అశోక్, బడే హరీష్, కటారి ప్రసాద్, తన్నీరు లింగయ్య, తోట తిరుపతి, మురళి, సురేష్, ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు

**వలిగొండ అక్టోబర్ 12 మహా న్యూస్** : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు రబీ సీజన్‌పై వాటి ప్రభావం ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన పంటల సాగు విధానం పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పథకాలు సూచనలు అమలవుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జలంధర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి అంజని దేవి అన్ని గ్రామాల సర్పంచులు రైతులువ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు శృతి స్వప్న సౌమ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు



# భగ్గుమన్న బండారి కుంట.. దుమ్ము, భారీ వాహనాలతో ప్రజలకు నరకయాతన!

- **భారీ టిప్పర్ల రాకపోకలతో ప్రమాదాలు.. విద్యార్థుల భద్రతపై ఆందోళన**
- **అధికారులు స్పందించకపోవడంపై కాలనీవాసుల నిరసన**

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి పట్టణంలోని 19వ వార్డు పరిధిలో ఉన్న బండారి కుంట రహదారి అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై దుమ్ము విపరీతంగా పేరుకుపోవడంతో పాటు భారీ టిప్పర్ల రాకపోకల వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలోని సుమారు 60 అడుగుల వెడల్పు గల రహదారిపై 30 అడుగుల భారీ టిప్పర్లు అధిక లోడుతో ప్రయాణిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఈ వాహనాల రాకపోకల కారణంగా సమీపంలోని ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల బారినపడి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. దళితులు, మైనార్టీలు అధికంగా నివసించే ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి సమస్య ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి బండారి కుంట రహదారిపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని, దుమ్ము సమస్యను పరిష్కరించి విద్యార్థులు, స్థానిక ప్రజలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి టిప్పర్ వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో బొంకూరి నవీన్, అజయ్, 19వ వార్డు ఏఐఎఫ్‌బీ పార్టీ ఇన్‌చార్జి ఎండీ షఫీ, గౌస్, నవాబ్, రియాజ్, బొంకూరి భూలక్ష్మి, మొలకల హారిక, కుక్క మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి కాలువ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

- **వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎల్లమ్మ గుండమ్మ చెరువులోకి ఎస్సారెస్పీ నీరు**

**పెద్దపల్లి మహా** : వేసవికాలంలో పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు (మినీ ట్యాంక్‌బండ్)లోకి నీటిని మళ్లించేందుకు చేపట్టిన కాలువ పనులను మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి కాలువ ద్వారా నీటిని తీసుకువచ్చి ఎల్లమ్మ గుండమ్మ చెరువును నింపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాలువకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీ సహాయంతో తొలగిస్తూ నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నూగిళ్ల మల్లన్న మాట్లాడుతూ, ఎస్సారెస్పీ కాలువ నీటితో ఎల్లమ్మ గుండమ్మ చెరువును నింపడం ద్వారా వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరువును నింపే ప్రక్రియకు పరిసర ప్రాంత రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జగదీష్, శ్రీకాంత్, అస్లాం, శ్రీలత రాజేందర్, హీనా యాబల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

- **బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం**
- **సమావేశంలో పాల్గొన్న టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ కుమార్**

**పెద్దపల్లి మహా** : ఈ నెల 14వ తేదీన గోదావరిఖనిలో నిర్వహించనున్న కార్మిక గర్జన బహిరంగ సభను విజయవంతం చేయడమే లక్ష్యంగా పెద్దపల్లి నియోజకవర్గంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక గర్జన బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా కృషి చేయాలని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రఘువీర్ సింగ్, రవీందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల అందజే

**సిన తహసీల్దార్ రాపెల్లి రాముడు,**

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాపెల్లి రాముడు, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంలో కల్యాణలక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేన సదయ్య, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్,పెగడపల్లి సర్పంచ్ ఆరెల్లి రమేష్, పందిల్ల సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, ఉపసర్పంచ్ ధర్మల రవి, వెన్నంపల్లి సర్పంచ్ కలవేన రమ-రమేష్, కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులు పాల్గొన్నారు.



# 35 ఏళ్ల పోలీస్ సేవలకు వీడ్కోలు.. హోంగార్డు వెంకటిని సత్కరించిన సీపీ

**పెద్దపల్లి మహా** : రామగుండం: పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు హోంగార్డుగా అంకితభావంతో సేవలందించిన మంచిర్యాల సబ్‌యూనిట్‌కు చెందిన బి. వెంకటి (హెచ్‌జీ1071) ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్తుతం మంచిర్యాల ఫింగర్‌ప్రింట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకటి సేవలను రామగుండం లీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి విశిష్ట సేవలందించిన వెంకటిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఆర్ఐ పెద్దన్న, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా హోంగార్డ్ ఇన్‌చార్జ్ ఏఆర్ఎస్ఐ బి. రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..




**మణుగూరు, మహా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసన ర్యాలీ, ధర్నాలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పాయం వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఢిల్లీకి చేరుకున్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు నిరసనకు మద్దతు తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఆందోళనలో భాగస్వాములమయ్యామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను నిరసన సందర్భంగా మరోసారి వినిపించారు.



# గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన సీపీ

**ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలి**

పెద్దపల్లి మహా : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పలువురు ఫిర్యాదుదారుల నుంచి సీపీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టపరిధిలో సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, అవసరమైన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వైభవంగా చంద్రకళా కలశ పూజోత్సవం

**దమ్మపేట ,మహా :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ దుర్గా మాతా శరన్నవరాత్రి మహోత్సవములు ,శివశక్తి యూత్ ఆద్వర్యంలో గత రెండు రోజులు గా వైభవంగా నిర్వహించబడుచున్నవి. మాజీ వైస్ ఎం.పి.పి దారా మల్లిఖార్జునరావు కాంప్లెక్స్ దగ్గర ఏర్పాటు చేయబడిన ఉత్సవాలలో సోమవారం కౌతా సూర్య నారాయణ శాస్త్రీ బ్రాహ్మత్వంలో చంద్రకళా కలశ పూజోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో మహిళా భక్తులు నిర్వహించారు. పలువురు మహిళా మూర్తులకు దారా మల్లిఖార్జునరావు ,భానుమతి దంపతులు నూతన వస్త్రాలను అందజేసి ఆశీర్వాదాలు పొందారు. ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తూ కోలాహలంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సమయంలో తెలంగాణ సాంప్రదాయ పద్దతిలో బతుకమ్మలను తీరొక్కరీతిలో పేర్చి ఆడపడుచులు కోలాట నృత్యాలు చేస్తూ భక్తి శ్రద్దలతో





## బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తప్పనిసరి: సీపీ అంబర్ కిషోర్ ఝా

- **ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేయాలి**

పెద్దపల్లి మహా : బ్యాంకులు, ఏటీఎంల వద్ద నేరాల నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బ్యాంకు అధికారులను ఆదేశించారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే ఆర్థిక నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, వివిధ బ్యాంకుల అధికారులతో బ్యాంకులు, ఏటీఎంల భద్రతపై సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, గతంలో జరిగిన బ్యాంకు, ఏటీఎం నేరాలు, ఆర్థిక నేరాల నివారణ, భవిష్యత్తులో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఏటీఎం కేంద్రాలు, మంచిర్యాల జోన్‌లో 109 బ్యాంకులు, 89 ఏటీఎం కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి బ్యాంకు, ఏటీఎంలో నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు ఏటీఎంల వద్ద 24 గంటలూ సెక్యూరిటీ గార్డులు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీసుల భద్రతా ఆడిట్‌లో కొన్ని కేంద్రాల్లో నాణ్యత లేని సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డుల కొరత గుర్తించినట్లు పేర్కొన్నారు. బ్యాంకుల ప్రవేశ ద్వారాల వద్ద డీఎఫ్ఎండీ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు హెచ్‌హెచ్ఎండీ పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సెక్యూరిటీ సిబ్బంది వ్యక్తిగత వివరాలు, ఫొటోలతో కూడిన రికార్డులను బ్యాంకుల్లో భద్రపరచాలని సూచించారు. బ్యాంకుల్లో దోపిడీ లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలనే అంశంపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు.

**సీసీ కెమెరాలు, డీవీఆర్ల భద్రతపై ప్రత్యేక దృష్టి**

నేరగాళ్లు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, వాటిపై స్ప్రే చేయడం, డీవీఆర్‌లను దొంగిలించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున డీవీఆర్‌లను సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. బ్యాంకుల లోపల, బయట అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను సెక్యూరిటీ గార్డులు నిరంతరం గమనించాలని తెలిపారు. అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్‌లను గుర్తించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.

**ఏటీఎంలలో నగదు నింపే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

ఏటీఎంలలో నగదు నింపే సమయంలో స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని సీపీ సూచించారు. దీంతో బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బందిని అప్రమత్తం చేసి భద్రతను పెంచవచ్చన్నారు. ప్రతి బ్యాంకు అధికారి, ఉద్యోగికి స్థానిక పోలీస్ స్టేషన్ అధికారుల ఫోన్ నంబర్లు తెలిసి ఉండాలని, హెల్ప్‌లైన్ నంబర్లు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సెలవు రోజులు, తెల్లవారుజామున, బ్యాంకులు తెరిచే సమయంలో, మూసివేసే సమయంలో, భోజన విరామ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు పని వేళల్లో సెక్యూరిటీ గార్డులు ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించాలని, పని వేళలు ముగిసిన తర్వాత తలుపులు పూర్తిగా మూసివేసిన అనంతరమే సిబ్బంది బయటకు వెళ్లాలని తెలిపారు. అనుమానాస్పద లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

## ప్రెస్ క్లబ్ పగ్గాలు దేవదానం, గంగాధర్‌కు!

- **అధ్యక్షుడిగా తడికమళ్ల దేవదానం.. కార్యదర్శిగా చీపు గంగాధర్ ఏకగ్రీవ ఎన్నిక**
- **జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ప్రాధాన్యం.. నూతన కార్యవర్గానికి సీనియర్ల భరోసా**



**సత్తుపల్లి, అక్టోబర్ 12**: మహా : జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సత్తుపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడికమళ్ల దేవదానం(మనం), కార్యదర్శిగా చీపు గంగాధర్(ఏబీఎన్) ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు తోట కిరణ్ చేసిన ప్రతిపాదనకు సభ్యులంతా ఏకాభిప్రాయం తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది.

**ఇళ్ల స్థలాల సాధనకు సమష్టి కృషి**

నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం సీనియర్ పాత్రికేయులు మదిరాజు సుధాకర్, ఎం.డి సైబుద్దిన్, భీమిశెట్టి రాము, చిన్నేని బాలు మాట్లాడుతూ.. జర్నలిస్టుల చిరకాల సమస్య అయిన ఇళ్ల స్థలాల సాధనకు నూతన కార్యవర్గం ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ లక్ష్య సాధనకు తమ వంతు సహకారం పూర్తిస్థాయిలో అందిస్తామని స్పష్టం చేశారు. సీనియర్ల హామీతో ప్రెస్ క్లబ్ సభ్యుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

**గత కార్యవర్గ సభ్యులకు సన్మానం**

గత ఏడాది ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా సేవలందించిన తోట కిరణ్, ఉపాధ్యక్షుడిగా యనమాల విజయ్, కోశాధికారిగా వ్యవహరించిన సాక్షి శ్రీను, ప్రచార కార్యదర్శిగా పనిచేసిన కాకర్ల జగన్‌లను నూతన కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

**జర్నలిస్ట్ సంక్షేమమే ధ్యేయం..**

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సీనియర్ పాత్రికేయుల సలహాలు, సూచనలతో జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇళ్ల స్థలం అందేలా సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ, సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భేతి ఆనంద్, ఉమామహేశ్వరరావు, సాక్షి సాంబ, బెల్లం చిరంజీవి, ఎస్.కె మీర, నల్లంటి మోహన్, బొల్లె పోగు సురేష్, మారోజు అశోక్ కుమార్, అబ్దుల్ మెహరాజ్, ఓబిలి శెట్టి రామారావు, దిశ సుధాకర్, బాజీ, నూనె శ్రీనివాసరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**బల్దియా అదనపు కమిషనర్ జోనా**

**కార్పొరేషన్,మహా:** ప్రజావాణి దరఖాస్తులను వేగవంతం గా పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వింగ్ అధికారులతో కలసి ప్రజల నుంచి 73 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు అప్పగించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల వారీగా టౌన్ ప్లానింగ్: 35 ఇంజినీరింగ్: 22 ఆరోగ్యం పారిశుద్ధ్యం: 06 రెవెన్యూ: 06 నీటి సరఫరా: 04 మొత్తం 73 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్ కుమార్, సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

- **ఇద్దరు కార్మికు లకు గాయాలు**

**మణుగూరు, మహా** : సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 రహదారిపై సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. దుర్గ ఓబీ క్యాంపు కార్యాలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో పీకేఓసీ-2లో కేబుల్‌మన్‌గా పనిచేస్తున్న యు పొట్టయ్య, కాంట్రాక్టు కార్మికుడు రాజేష్ గాయపడ్డారు. పొట్టయ్య ముఖానికి తీవ్ర గాయాలు కాగా, రాజేష్‌కు కాలర్‌బోన్ విరిగింది. క్షతగాత్రులను వెంటనే స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీవైసీఎంఓ జ్యోతిర్మయిని కోరారు. వైద్యుల సూచనల మేరకు ఇద్దరు కార్మికులను వేర్వేరు అంబులెన్స్‌లలో కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కార్మికులకు అవసరమైన వైద్యసేవలు అందేలా ఏఐటీయూసీ నాయకులు చర్యలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనర్సయ్య, జీఎం కమిటీ సభ్యుడు ఆవుల నాగరాజు, పీకేఓసీ-2 ఫిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి, ఆసుపత్రి సెక్రటరీ ఎం.పద్మావతి, సేఫ్టీ కమిటీ సభ్యుడు నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం..

- **ఉత్పత్తి, రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి**
- **సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ**




**మణుగూరు, మహా** : సింగరేణి మణుగూరు ఏరియాలో రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ ఆదేశించారు. సోమవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో కలిసి కేఎచ్‌సీహెచ్‌పీ, పీకేఓసీ-2 కోల్ బెంచ్, పీకేఓసీ-4 కంటిన్యూయస్ మైనర్ ప్రాంతాలను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ప్రాసెసింగ్, రవాణా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత కేఎచ్‌సీహెచ్‌పీలో క్రషర్ల పనితీరు, బొగ్గు ప్రాసెసింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. క్రషర్లకు సకాలంలో మరమ్మతులు చేపట్టి నిరంతరాయంగా పనిచేసేలా చూడాలని సూచించారు. బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా షేల్ పికింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బ్లాస్టింగ్ సమయంలో పెద్దపెద్ద బొగ్గు పెళ్లలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. బొగ్గు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం పీకేఓసీ-2 గనిలోని కోల్ బెంచ్‌ను పరిశీలించి రోజువారీ, నెలవారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అవసరమైన సంఖ్యలో షావెల్స్‌ను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు భారీ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. గనిలోని బాటమ్ బెంచ్‌ల వద్ద నిల్వ ఉన్న నీటిని త్వరితగతిన తొలగించి బొగ్గు వెలికితీతకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పీకేఓసీ-4లో కంటిన్యూయస్ మైనర్ ప్రాంతాన్ని సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనుల పురోగతిని సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణా చేయాలని, అందుబాటులో ఉన్న యంత్రాలు, మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. కార్మికుల రక్షణకు ప్రాధాన్యమిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పీకేఓసీ ప్రాజెక్టు అధికారి బి శ్రీనివాసచారి, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్ రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేశ్, ఏరియా ఇంజినీర్ వి మధన్ నాయక్, డీజీఎం (కేఎచ్‌సీహెచ్‌పీ) ఆర్ఎస్ గౌడే, ప్రాజెక్టు మేనేజర్ సౌరభ్ సుమన్, ఆపరేషన్స్ మేనేజర్ సురేశ్, క్వాలిటీ హెచ్‌వోడీ నాగరమేశ్, ఏరియా రక్షణ అధికారి జి.నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి రమేశ్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిణి కె స్వప్న, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ సాయిల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- **వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు యువత, విద్యార్థులు పాల్గొనాలి**
- **సీపీ అంబర్ కిషోర్ ఝా**




**పెద్దపల్లి మహా** : పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. దేశ శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రజలకు తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

**పలు అవగాహన కార్యక్రమాలు**

వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలను ప్రజలకు వివరించనున్నారు. రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు నిర్వహించడంతో పాటు యువత, విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. ోలీస్ అమరవీరుల కుటుంబాలను అధికారులు స్వయంగా పరామర్శించి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. అమరవీరుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. పోలీస్ కళాబృందం ద్వారా ప్రజా ప్రదేశాల్లో పాటలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రధాన కూడళ్లలో అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేయనున్నారు.

**పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు**

పోలీస్ సిబ్బందికి రెండు కేటగిరీల్లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు ఒక కేటగిరీ, ఎస్ఐ మరియు పైస్థాయి అధికారులకు మరో కేటగిరీగా పోటీలు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో పోలీసుల నుంచి ప్రజలు ఆశించే సేవలు, పోలీసులపై ప్రజల్లో గౌరవం పెంపొందించడం, క్షేత్రస్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయడం, సోషల్ మీడియా వినియోగం వంటి అంశాలపై వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు.

**షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు**

పోలీస్ అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనాలని సీపీ కోరారు. పోటీల్లో పాల్గొనేవారు మూడు ఫోటోలు, మూడు నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్ సమర్పించాలి. ఫోటోలు 10×8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిల్మ్‌ను పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లో అందజేయాలి.కమిషనరేట్ స్థాయిలో ఎంపిక చేసిన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీలకు డీజీపీ కార్యాలయం, హైదరాబాద్‌కు పంపించనున్నారు. ఎంట్రీలను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.అక్టోబర్ 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్మృతి పరేడ్, పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

## అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**కలెక్టరేట్ మహా :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 98అర్జీలను ప్రజలు అందజేయగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 97 అర్జీలు ( మొత్తం 225) వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- **పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయం సంక్షోభం**
- **సాగుదారులకు సర్కారు భరోసా కల్పించాలి**
- **రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం**
- **సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు**
- **ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం**
- **ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు డిమాండ్ల వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు గిట్టుబాటు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. అర్హులైన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కోరారు. వ్యవసాయానికి పగటిపూటే నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల కాల్వల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.15 వేల చొప్పున ఎలాంటి కోతలు విధించకుండా రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో పూర్తిస్థాయిలో వర్తింపజేసి అన్నదాతలను రుణవిముక్తులను చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమగ్ర పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, పూర్ణచందర్ రావు, వైఎస్ గిరి, గుర్రం వెంకటేశ్వర్లు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.




## "కర్రీ పాయింట్ కేంద్రాల" మూసివేత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** నిత్యవసర ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు నిరసనగా కొత్తగూడెం కర్రీ పాయింట్ అసోసియేషన్ సూచన మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో వ్యాపారస్తులు కర్రీ పాయింట్ కేంద్రాలను మూసి వేయడం జరిగింది. అన్ని రకాల నిత్యవసర ధరలు పెరగడం వల్ల కర్రీ పాయింట్ వ్యాపారస్తులకు సరైన గిట్టుబాటు ధర లభించిన కారణంగా కర్రీ పాయింట్ కేంద్రాలను మూసివేసినట్లుగా కొందరు వ్యాపారాలు ఆవేదన వ్యక్తం చేస్తూ పేర్కొనడం జరిగింది. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కొత్త రేట్లతో కర్రీ పాయింట్ కేంద్రాలు మంగళవారం నుండి యధావిధిగా కొనసాగనున్నాయి.

## ఘనంగా రిటైర్డ్ ఎమ్మార్వో జన్మదిన వేడుకలు

**హాజరైన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు**



**వరంగల్, మహా :** వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్, రిటైర్డ్ తహసిల్దార్ అయినటువంటి కుసుమ సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఓ సిటీ లోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ స్నేహితులు, బంధుమిత్రుల సమక్షంలో కుసుమ సత్యనారాయణకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బర్త్డే బాయ్ కుసుమ సత్యనారాయణ మాట్లాడుతూ, నా జన్మదినాన్ని గుర్తుపెట్టుకొని ఉదయాన్నే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. మీ అందరి సమక్షంలో ఈ సంవత్సరం నా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని కుసుమ సత్యనారాయణ బాగోద్వేగానికి లోనయ్యారు. ఈ వేడుకల్లో వాకర్స్ అసోసియేషన్ బందు మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## రామ్‌లీలా కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, మహా:రానున్న దసరా పండుగ సందర్భంగా బెల్లంపల్లి నంబర్ 1 గ్రౌండ్‌లో నిర్వహించనున్న రామ్‌లీలా కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో రూ.1,00,116 చెక్కును హిందూ ఉత్సవ కమిటీకి సోమవారం నాడు క్యాంపు ఆఫీసులో అందజేశారు.ప్రస్తుతం ఎమ్మెల్యే ఢిల్లీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్,మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమరి సూరిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ చేతుల మీదుగా హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు కోడి రమేష్, నగేష్,బాల సంతోష్,నరేష్‌లకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి మెంబర్ చిలుముల శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, బండి రాము, కొత్తపల్లి శ్యామ్,డి సి సి ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, పట్టణ ఉపాధ్యక్షుడు లెంకల శ్రీనివాస్, మత్తమరి శ్రీనివాస్, ఎండీ వజీయార్, ఎండి వాజిద్, నాగేందర్, అచ్చే సాయికిరణ్, రామిల్ల ప్రదీప్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**బెల్లంపల్లి, మహా:** వేమనపెల్లి మండలం బుయ్యారం గ్రామంలో స్వర్గీయ కొరకొప్పుల దుర్గా గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పీటీసీ సభ్యులు రుద్రబట్ల సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు, బుయ్యారం గ్రామ సర్పంచ్ కోండి మానస-శ్రీకాంత్ , కీర్తిశేషులు దుర్గా గౌడ్ వారసులు శ్రీనివాస్ గౌడ్ ,జగన్ బాబు ,రవీందర్ గౌడ్ కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందిస్తాయని, గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.స్వర్గీయ దుర్గా గౌడ్ జ్ఞాపకాలను చిరస్మరణీయం చేస్తూ, క్రీడాస్ఫూర్తితో టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.టోర్నమెంట్ మేనేజ్మెంట్ గోగర్ల రవి, బోరుకుంట శివ కుమార్, దుర్గం విష్ణు అండ్ టీం తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందడుగు

- **ఈ నెల 15లోగా లాభాల వాటా చెల్లించాలని ఐఎన్‌టీయూసీ డిమాండ్**
- **సొంతింటి పథకం, వైద్య ప్రయోజనాలు అమలు చేయాలని విజ్ఞప్తి**



**సత్తుపల్లి, అక్టోబరు 12**:మహా : సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో ప్రభుత్వ, సింగరేణి యాజమాన్య ప్రతినిధులతో కార్మికుల సమస్యలపై చర్చించినట్లు చెప్పారు.

**లాభాల వాటా చెల్లింపుపై ప్రధానంగా చర్చ**

సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ఈ నెల 15లోగా చెల్లించే ప్రక్రియను పూర్తి చేయాలని కోరినట్లు కోటేశ్వరరావు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు వైద్య బోర్డుల ద్వారా అందాల్సిన ప్రయోజనాలను త్వరగా కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కార్మికులకు సొంత ఇళ్లు నిర్మిస్తామన్న ఎన్నికల హామీని అమలు చేసి, గృహ పథకాన్ని ప్రారంభించాలని కోరినట్లు పేర్కొన్నారు. కోల్ ఇండియా తరహాలో పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించే అంశాన్ని కూడా చర్చించినట్లు వివరించారు.

**11 అంశాలపై వినతులు**

కార్మికుల అటెండెన్స్ నేమ్స్ సమస్యను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కోర్టు, విజిలెన్స్ కేసులను మానవీయ దృక్పథంతో పరిశీలించాలని ఐఎన్‌టీయూసీ కోరింది. కొవిడ్ సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు మరో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. సింగరేణి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు గనులను కేటాయించాలని కోరింది. తెలంగాణ విద్యుత్తు ఉత్పత్తి, ప్రసార సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బొగ్గు ఉత్పత్తితోపాటు అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేసి సంస్థ ఆదాయాన్ని పెంచాలని సూచించింది. గనుల్లో డ్రిల్ బిట్స్, భద్రతా సామగ్రి, విడిభాగాలకు కొరత లేకుండా చూడాలని, కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని కోరింది. సింగరేణి అధికారులకు సంబంధించిన పెండింగ్ పనితీరు ప్రోత్సాహక బహుమతి (పీఆర్‌పీ) చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

**కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం**

సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పనిచేస్తోందని కోటేశ్వరరావు తెలిపారు. కార్మికులకు న్యాయంగా అందాల్సిన ప్రయోజనాల కోసం ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మురళీకృష్ణ, పిట్ కార్యదర్శులు సీతారామరాజు, నగేష్, జగదీష్, ఇక్బాల్, కేదం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- **ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వొద్దు**
- **జిల్లా జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, హౌసింగ్ పిడితో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాలు ఉపాధి పింఛన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## నిఘా వ్యవస్థను మరింత బలోపేతం

- **భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
- **కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. సోమవారం ఆయన చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ నేరాల గుర్తింపు దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేయడంతో జిల్లాలో నిఘా వ్యవస్థ మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం నేరాల నియంత్రణ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానున్నదన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని నేరాల నియంత్రణలో సీసీటీవీ నిఘా వ్యవస్థ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## మహిళల భద్రతకు భరోసా టీ సేఫ్ అప్

- **ప్రజలకు అవగాహన కల్పించిన షీ-టీం ఎస్సై రామారావు**

**పోచమ్మ మైదానం, మహా** : ప్రస్తుత కాలంలో జరుగుతున్న నేరాలు, మహిళల పై అఘాయిత్యాలు పెరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు అన్నారు. వరంగల్ లోని దేశాయ్ పేట లేబర్ అడ్డా లో దాదాపు 70మంది రోజువారి శ్రామికుల కు సైబర్ నేరాలు, మహిళల పై జరిగే అత్యాచారాలు, మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరంగల్ షీ టీమ్ ఎస్సై రావెళ్ల రామారావు మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగి వుండాలని మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు అందరు టీసేఫ్ ఆప్ ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని, టీసేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్టైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ 1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశాయ్ పేట లేబర్ అడ్డా పెద్ద మనిషి సమ్మయ్య తో పాటు మహిళా శ్రామికులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ

**బెల్లంపల్లి, మహా**: భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు పులగం తిరుపతి ఆధ్వర్యంలో తన స్వంత ఖర్చులతో 40 మంది మహిళలకి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ విచ్చేసి మాట్లాడారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, మహిళల ఆత్మగౌరకోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం అని అన్నారు.మహిళలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని వారి నాయకత్వాన్ని మహిళలు బలపరచారని కోరారు.ఈ సందర్భంగా తాండూరు మండలానికి చెందిన ఎండి బాబా,షబానా దంపతుల కూతురు సనా అంజుమ్ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆల్ ఇండియా స్థాయిలో సాఫ్ట్ బాల్ పోటీలకి ఎంపికైన సందర్భంగా విద్యార్థిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్,యాంగర్ తుకారాం, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్,మండల కార్యదర్శి గాదే రాజేశం,ఆవుల చందు న్యాయవాదులు శ్యామరావు, దుర్గం రమేష్, నటీశ్వర్, సోషల్ మీడియా కన్వీనర్ కామెరా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సి ఎం ఆర్ ఎఫ్ ఎంతో అండ

**వొడ్నాల శ్రీనివాస్**



**క్యాతనపల్లి మహా :** ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, క్యాతనపల్లి మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముక శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటికి ఆత్మ కమిటీ చైర్మన్ భూమిపూజ

**ఆదిలాబాద్ మహా :** ఇందిరమ్మ ఇండ్లతో ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందని ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు అన్నారు. సోమవారం చాందా (టి) గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు డోకే మంజుల రవి నూతన గృహ నిర్మాణానికి ఆయన స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటి నిర్మాణ పనులకు టెంకాయ కొట్టి భూమి పూజ చేసారు.ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో మొదటి రెండో విడతలో ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినట్టు తెలిపారు. మూడో విడతలోను మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా ఆయన కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలోగ్రామ నాయకులు లంక సుదర్శన్, బొజ్జ అడెల్లు ,సతీష్ ,ఆరే పోచన్న, అశోక్, సాహెబ్ రావు తదితరులు పాల్గొన్నారు.




## పెండింగ్ భూ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

**సీసీఎల్ఏ లోకేష్ కుమార్ వెల్లడి**

మంచిర్యాల, మహా ప్రతినిధి : భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని సమస్యలను వేగం పెంచాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీ.సీ.ఎల్.ఎ.) లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లోని అర్హమైన ఖాళీ స్థలాలు, ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యు.ఎల్.సీ), భూముల క్రమబద్ధీకరణ, సింగరేణి పరిధిలోని భూ సమస్యలు, జీవో నెం.59 అమలు, గ్రామాల రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మెమోలు, నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అర్హమైన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రీసర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నాయబ్ తహసీల్దార్ నుండి జూనియర్ అసిస్టెంట్ వరకు సర్వే విధానం, పరికరాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు.జీవో 59 మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, బిసూపరింటెండెంట్ అతీష్, డిసూపరింటెండెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి నివారణకు మున్సిపల్ చర్యలు

- **4కోట్ల వ్యయంతో చెక్ డ్యాం నిర్మాణానికి ప్రణాళిక**
- **కలెక్టర్ తో కలిసి స్థలం పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్**

**అదిలాబాద్ మహా** : రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా 4 కోట్ల రూపాయల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టనున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇతర అధికారులతో కలిసి లండసాంగి పంప్‌హౌస్ ను సందర్శించారు. ప్రతిపాదిత చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించడంతో పాటు సంబంధిత మ్యాప్‌ను పరిశీలించి, నీటి నిల్వలను పెంపొందించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటం తమ ప్రధాన బాధ్యత అన్నారు. రానున్న వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.4 కోట్ల రూపాయల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన చేపట్టామన్నారు. ఈ నిర్మాణం ద్వారా నీటి నిల్వలను పెంపొందించి, ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా, నీటి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రానున్న వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్ , మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్ , మున్సిపల్ , ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గాన్ని మానసిక శోభకు గురిచేయడం చేయడం శోచనీయం

- **ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి**

**బెల్లంపల్లి, మహా:** ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గాన్ని మానసికక్షోభకు గురిచేయడం చేయడం శోచనీయమనీ ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం నాడు మందమర్రి ఏరియా శాంతిఖని మైన్ లో ఉదయం 7:00గంటలకు గేట్ మీటింగ్ కి ముఖ్యఅతిథిగా సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి విచ్చేసి కార్మికులకు సుదీర్ఘమైన ప్రసంగం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో దోపిడి వర్గ ప్రభుత్వాలకు కార్మిక వర్గ దృక్పథం తెలియని సంఘాలకు సంపూర్ణ రాజకీయ చైతన్యంతో ఆర్టీసీ కార్మికులు మద్యానికి, విచ్చలవిడి డబ్బుల పంపిణీ విధానాలను, పాలకుల మోసపూరిత విధానాలను గుర్తించిన కార్మిక వర్గం ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎర్రజెండాను ఐక్య కూటమిని ఆదరించి 77 డిపోలలో ఆర్టీసీ కార్మికులు విజయ బావుటా ఎగిరివేయడం శుభపరిణామంగా భావిస్తూ ఆర్టీసీ కార్మిక వర్గానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విప్లవ ధన్యవాదాలు తెలియజేస్తుందన్నారు.ఈ నేపథ్యంలో సింగరేణి కంపెనీలో రాజకీయ జోక్యాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని,సింగరేణిలో కార్మికులను కట్టు బానిసల కంటే హీనంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం తమ తప్పుడు విధానాలను విరమించుకోవాలనీ, సింగరేణి కంపెనీకి రావలసిన బకాయిలు ట్రాన్స్కో జెన్కో నుండి ఇవ్వవలసిన 59 వేల కోట్లు బకాయిలను కంపెనీకి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ 13వ తారీకు హైదరాబాదులో విద్యుత్ సంస్థల ముందు జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ సందర్భంలోనే సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డులో ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించకుండా సింగరేణి మెడికల్ గైడ్లైన్స్ ను అమలు చేయకుండా ఏ రకమైన ఉద్యోగానికి అర్హత లేని కార్మికులను కూడా ఫిట్ ఫర్ సేమ్ జాబు అంటూ వైద్య అధికారులు కార్మికులను, కార్మిక కుటుంబాలను మానసిక క్షోభ కు గురిచేయడాన్ని మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది కాబట్టి యజమాన్యం మానవ దృక్పథంతో మెడికల్ అన్ఫిట్ చేసి కార్మిక కుటుంబాలలో ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.విజయదశమికి ఇవ్వవలసిన లాభాల వాటాను ఇంతవరకు ప్రకటించకుండా నికర లాభాలను ప్రకటించకుండా కాలయాపన చేస్తూ కార్మికులను మానసిక క్షోభ గురి చేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది కావున ప్రభుత్వం తమ మేకపోతు గాంభీరత్వాన్ని విరమించి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను వెంటనే 40శాతం చెల్లించాలని,సింగరేణిలో కార్మిక చట్టాల అమలు పారిశ్రామిక సంబంధాలు కొనసాగించకపోవడం కనీసం మెటీరియల్ సప్లై చేయకపోవడం కార్మికులను మానసిక ప్రశాంతతగా ఉండనీయకపోవడం ఇదంతా కూడా ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించకపోవడం మానవ హక్కులను అమలు చేయకపోవడం కార్మికుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం. అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ కిందికి వస్తుంది. ఈ క్లిష్ట పరిస్థితిలో సింగరేణి కోసం కార్మికవర్గ హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎర్రజెండా యూనియన్ నాయకత్వానికి చేయూతనివ్వాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐ టి యుసి రత్నం ప్రవీణ్ ఫిట్ కార్యదర్శి, అధ్యక్షత వహించారు. బ్రాంచ్ కార్యదర్శి మంతెన రమేష్, రత్నం ఐలయ్య ఏఐ టీయూసీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు, దాడి రమేష్ సహాయ కార్యదర్శి ,రామకృష్ణ, అంజత్ ఖాన్,రాజేశం,ఎస్కే మైన్ మైన్స్ కమిటీ సభ్యులు సేఫ్టీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**రబీ సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండాలి**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**వరంగల్ కలెక్టరేట్** : ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో రైతులు వరి సాగు చేయకుండా తక్కువ నీటితో పండే స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నీటి వనరులను సంరక్షించుకుంటూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ బిందు సేద్యం ద్వారా పామ్ ఆయిల్ తోటలు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, ఊర కుంటల అభివృద్ధి, బోరుబావుల రీచార్జ్ వంటి పనులు చేపట్టి జలవనరులను పరిరక్షించుకోవాలని సూచించారు.

**నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

గీసుకొండ మండలం కోనాయిమాకుల గ్రామంలోని రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణంలో సంభవించే మార్పులు వ్యవసాయ రంగం, ప్రజల జీవన విధానంపై చూపే ప్రభావాలను వివరించారు. రైతులు, ప్రజలు పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని, నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా పెసలు, మినుములు, అలసందలు, నువ్వులు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ దిశగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణతో పాటు వర్షపు నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని, వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగ భారాన్ని తగ్గించేందుకు ఇళ్ల వద్ద, వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆనందం, ఇరిగేషన్ ఎస్ఈ రామ్ ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నవరాత్రి పూజలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత బండారు నీలం రెడ్డి

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ లో దుర్గమాత ఆలయం లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గా దేవి నవరాత్రి పూజా కార్యక్రమంలో . ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బండారు నీలం రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దుర్గా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గా నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, శక్తి ఆరాధనకు ప్రతీకలని, ఈ పవిత్ర పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు భక్తి భావంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, పండుగ వాతావరణాన్ని ఆనందంగా ఆస్వాదించాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు, భక్తులు పరస్పర సహకారంతో వ్యవహరిస్తూ ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సి ఎం ఆర్ ఎఫ్ ఎంతో అండ : వొడ్నాల శ్రీనివాస్

**క్యాతనపల్లి మహా :** ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, క్యాతనపల్లి మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముక శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపుఆఫీస్ లో వినాయక లడ్డూ వేలం పాట

- **అమ్మ అనాథ శరణాలయం ఆశ్రమానికి రూ. 20వేల నగదు విరాళం అందజేత**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు తెలంగాణ క్యాబినెట్లో చోటుదక్కాలని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరూ ఒకే తాటిపైకి వచ్చి బెల్లంపల్లి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుకుంటూ, విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో నిర్వహించిన వినాయక చవితి నవరాత్రుల లడ్డూ వేలం పాటలో తాజా మాజీ కౌన్సిలర్,రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ భూక్యా రాము నాయక్ రూ.20,000 లకు లడ్డూను దక్కించుకోగా సంబంధిత నగదును విరాళం రూపంలో అమ్మ అనాథ శరణాలయానికి అందించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులందరూ ఒకే కుటుంబంగా కలిసి, వినోద్ కి వెన్నంటి ఉండేందుకు ముందుకు వచ్చిన శుభ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు, వైస్ చైర్మన్ రాగం శెట్టి సతీష్ ల సూచన మేరకు వేలం పాట ద్వారా వచ్చిన రూ.20,000 నగదును అమ్మ ఆశ్రమానికి విరాళంగా అందించడం జరిగిందన్నారు. విరాళాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, రాష్ట్ర నాయకులు చిలుముల శంకర్, మునుమంద రమేష్, పట్టణాధ్యక్షులు బండి ప్రభాకర్, ఉపాధ్యక్షులు శ్యామ్, మాజీ పట్టణ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ శంకర్ సింగ్, సీనియర్ నాయకులు గెల్లి జయరామ్, అఫ్జల్, బండి రామ్ లక్ష్మణ్ తదితరుల చేతుల మీదుగా అందజేశారు.



## సేవా భారతి సేవలు అభినందనీయం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...**

శంషాబాద్ మహా : సేవా దృక్పథంతో సమాజంలో పేద ప్రజల సంక్షేమానికి సేవా భారతి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్ పల్లి లో సేవా భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,సర్పంచ్ ఎల్గాని ప్రభాకర్ గౌడ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**

సమాజ సేవలో సర్వస్వం కోల్పోయిన వృద్ధులకు చిన్నారులకు అండగా నిలవడంలో సేవా భారతి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా భారతి చేపడుతున్న మంచి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. వృద్ధులకు, అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న గోపి చందు రాజును ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్, మల్లికార్జున్ యాదవ్, వార్డు సభ్యులు, నాయకులు శ్రీనివాస్, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ కమిషనర్‌కు ఉద్యోగుల జేఏసీ జన్మదిన శుభాకాంక్షలు

- **జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోలీస్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని వినతి**
- **సానుకూలంగా స్పందించిన సీపీ గౌస్ ఆలం**

**కరీంనగర్ మహా** : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్‌ను ఉద్యోగుల జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సీపీని కలిసి ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి వారికి న్యాయం చేయాలని కోరుతూ సీపీకి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గౌస్ ఆలం, పోలీస్ వెరిఫికేషన్‌ను ప్రాధాన్యత ప్రాతిపదికన త్వరగా పూర్తి చేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యపై కమిషనర్ తక్షణమే స్పందించడంపై జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ అభినందనీయం**

ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి పరిష్కారానికి చొరవ చూపడం అభినందనీ యమన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోలీస్ వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేసి వారికి న్యాయం జరిగేలా ఆదేశాలు జారీ చేసిన సీపీకి టీఎన్జీవోల సంఘం, ఉద్యోగుల జేఏసీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్వీందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, లవకుమార్, జీవన్ రెడ్డి, అజయ్, ఆనంద్, రాకేష్, ప్రభాకర్ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు త్వరగా పరిష్కరించాలి

**కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా అందించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు జలమండలి ఈడీ పంకజ, జీఎం సంతోష్‌లతో ఆయన సమావేశమై పలు ప్రాంతాల్లో నెలకొన్న నీటి సరఫరా సమస్యలపై చర్చించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.





## 35 ఏళ్ల పోలీస్ సేవలకు వీడ్కోలు.. హోంగార్డు వెంకటిని సత్కరించిన సీపీ

- **ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్ష**

**పెద్దపల్లి మహా** : రామగుండం: పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు హోంగార్డుగా అంకితభావంతో సేవలందించిన మంచిర్యాల సబ్‌యూనిట్‌కు చెందిన బి. వెంకటి (హెచ్‌జీ1071) ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.. ప్రస్తుతం మంచిర్యాల ఫింగర్‌ప్రింట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకటి సేవలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి విశిష్ట సేవలందించిన వెంకటిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఆర్ఐ పెద్దన్న, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా హోంగార్డ్ ఇన్‌చార్జ్ ఏఆర్ఎస్ఐ బి. రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శ్రీకారం

- **రూ.3.94 కోట్లతో కాలనీల్లో మౌలిక వసతుల కల్పన**

**కుషాయిగూడ, మహా** : నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ డివిజన్‌లో పలు కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.3.94 కోట్ల ప్రతిపాదిత నిధులతో రహదారులు, డ్రైనేజీ, ఆర్‌సీసీ పైప్‌లైన్, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.

**కాలనీల వారీగా నిధులు**

వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రూ.36 లక్షలు, ఆదర్శ నగర్‌లో రూ.20 లక్షలు, చక్రిపురంలో రూ.22 లక్షలు, లక్ష్మీనరసింహ కాలనీలో రూ.26 లక్షలు, కుషాయిగూడ గ్రామంలో రూ.30 లక్షలు, భారత్ నగర్‌లో రూ.29.70 లక్షలు, ధోబీఘాట్‌లో రూ.19.80 లక్షలు, హనుమాన్ నగర్‌లో రూ.17 లక్షలు, శివసాయి నగర్‌లో రూ.42 లక్షలు, మారుతీనగర్‌లో రూ.25 లక్షలు, నాగార్జున నగర్‌లో రూ.35 లక్షలు, శ్రీనివాస్ ఎన్‌క్లేవ్‌లో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సోనియా గాంధీ నగర్‌లో ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు రూ.25 లక్షలు, ఇందిరానగర్‌లో యూజీడీ పనులకు రూ.27.50 లక్షలు కేటాయించారు. ఈ పనులు పూర్తయితే ఆయా కాలనీల్లో రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపడటంతో ప్రజలకు ఇబ్బందులు తగ్గనున్నాయి. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాలనీలవారీగా అవసరమైన పనులు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



## ఓపెన్ జిమ్, ప్రారంభించిన.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా** : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్ట్ పిల్లల ఆట వస్తువులనుసోమవారంజోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, కాలనీవాసులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం

- బిఆర్ఎస్వి అధ్యక్షులుకనకటి శివ

**రాజేంద్రనగర్ మహా** : గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని కోత్వాల్ గూడ 119వ డివిజన్ నూతన బిఆర్ఎస్వి కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షులు కోన్నెమొల్ల శ్రీనివాస్ సోమవారం నియమించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, విద్యార్థి సంఘం బలోపేతమే లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందన్నారు.అధ్యక్షులు కనకటి శివ, ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట్ చరణ్‌దీప్, ఉపాధ్యక్షుడుగొడుగు శ్యామ్ ప్రసాద్ కార్యదర్శి సుశాంత్ ను నియమించారు. విద్యార్థుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, బిఆర్ఎస్వి బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, జయసింహ,బైరమోనిమల్లేష్ రాజేందర్, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీ వీరలక్ష్మి అమ్మవారి అభిషేకం

**రాజేంద్రనగర్ మహా** : శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని శ్రీ రామ్ నగర్ లో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండొవ రోజు శ్రీ వీరలక్ష్మి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నేత్రపర్వంగా విశేష అభిషేక మహోత్సవం జరిపించారు. సాయంత్రం శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీ వీరలక్ష్మి అమ్మవారి పల్లకిసేవ, అర్చన, నివేదన మంగళాశాసనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కన్నుల



పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## రక్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలి...

**చెల్లుబాటయ్యే సరైన పత్రాలు కలిగి ఉండాలి**

**ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం , మహా:** విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు, రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, సీఐ జితేందర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శాస్త్రగార్డెన్ సమీపంలో ఏమైంది రా అరేయ్ వాహన తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వేసుకోవాలని, వాహనాలను అతివేగంగా వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రక్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని వాహనదారులకు సిఐ సూచించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ జితేందర్ రెడ్డి, వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సురేష్, ఇతర సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు

## వైద్య సౌకర్యాలు అందించండి

- అనారోగ్య మరణాలకు రాంకీయే బాధ్యత వహించాలి
- ప్రజావాణిలో ఎంఎంసీ కమిషనర్ కి వినతి పత్రం




**జవహర్ నగర్, మహా** : డంపింగ్ యార్డ్ ను శాస్త్రీయ పద్ధతిలో శాశ్వతంగా మూసివేయాలని... ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు వైద్య సౌకర్యాలను కల్పించాలని డంపింగ్ పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యంతో మరణిస్తే దానికి రాంకీయే బాధ్యత వహించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ సభ్యులు చైర్మన్ షేక్షావలి, కన్వీనర్ ఉమామహేష్‌లు పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ సభ్యులు సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి కన్వీనర్ ఉమామహేష్ లు మీడియాతో మాట్లాడుతూ జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డ్ వల్ల జవహర్ నగర్ ప్రభావిత ప్రాంతాల్లో సంభవించే అనారోగ్య మరణాలపై సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎఫ్ఐఆర్ లు నమోదు అయ్యాకే దహన సంస్కారాలు జరిపేలా ఆయా ప్రాంతాల్లోని స్మశాన వాటికలకు ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. జవహర్ నగర్ లో నెలకొని ఉన్న డంపింగ్ యార్డును వెంటనే శాస్త్రీయ పద్ధతులు శాశ్వతంగా మూసివేసి పర్యావరణ పునరుద్ధరణ ఉచితంగా పరిశుభ్రమైన మంచినీటి సరఫరా, వైద్య సౌకర్యాలు అందించాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాదులోని చెత్తనంతటిని జవహర్ నగర్ కు తరలించడం ద్వారా సంబంధిత ప్రాంత ప్రజలు తీవ్రమైన అనారోగ్య పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. మిథెన్ వాయువుతో గాలితో భూగర్భ జలాలు కలుషితమై ఊపిరి సలపని వ్యాధులతో మానసిక శారీరక బాధలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ మే నెలలో ప్రభుత్వం డంపింగ్ యార్డ్ సమస్యపై ఎంపీ ఎమ్మెల్యేలతో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం తర్వాత ప్రభుత్వ అధికారులు తీసుకున్న నిర్ణయాలను వాటి అమలు ఏ మేరకు కొనసాగుతున్నాయో స్పష్టంగా డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వ్రాతపూర్వకంగా తెలియజేసి బహిరంగంగా తెలియజేయాలని కోరారు. గత నెల రోజులుగా కార్మిక నగర్, గబ్బిలాలపేట, శాంతినగర్, ఆర్జీ కాలనీ, దమ్మాయిగూడ, ఈస్ట్ నందమూరి నగర్ ,లాంటి తదితర ప్రాంతాల కాలనీలలో ఎన్నడూ లేని విధంగా విపరీతమైన దుర్వాసనలు గ్యాస్ లీకేజీలు మురికినీరు పైప్ లైన్ల ధ్వంసం మురికి నీటి బుడగలు గాలి ద్వారా ఇళ్లలోకి ప్రవేశించి తినే ఆహారాన్ని త్రాగే మంచినీరును బట్టలు తలుపులు, కిటికీల పై పడి వృద్ధులు పసిపిల్లలు మహిళలు ఊపిరితిత్తులు చర్మవ్యాధులతో బాధపడుతున్నారని తెలియజేశారు. ఇకనైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. పాలకులు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు శాశ్విత పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో ప్రజా ఉద్యమాల ద్వారా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్స్ గడ్డం సదానందం, పి. శివ బాబు, వై మల్లేష్, వి. ప్రవీణ్, గడిపే సునీత, సురేందర్, జయసుధ ,భద్రకామి ఆంజనేయులు, రాజనర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## మల్ రెడ్డి యువశక్తి నేతృత్వంలో బతుకమ్మ సంబరాలు

- పట్నంలో ఈనెల 14న బతుకమ్మ సంబరాలు
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే రంగారెడ్డి
- పెద్ద ఎత్తున హాజరు కానున్న మహిళలు నాయకులు
- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 12 మహా:** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మహమ్మద్ గౌస్ పాషా అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో, మల్ రెడ్డి యువశక్తి కన్వీనర్, మల్ రెడ్డి స్నేహఅభిషేక్ రెడ్డి నేతృత్వంలో ఈ నెల 14వ తేదీన బుధవారం సాయంత్రం, బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించనున్నట్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా తెలిపారు.. ఈ యొక్క బతుకమ్మ సంబరాల కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు గౌస్ పాషా తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఆడబిడ్డలకు ప్రత్యేకంగా బతుకమ్మ పోటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, ప్రథమ బహుమతిగా రూ.25,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 భారీ నగదు బహుమతులను, శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అందించటం జరుగుతున్నది గౌస్ పాషా చెప్పారు. మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు ప్రముఖ జానపద కళాకారులు కూడా పాల్గొననున్నారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

## నీట్ పీజీలో రెడ్డి కాలనీ విద్యార్థిని కట్కూరి భావన రెడ్డి ప్రతిభ..

- ఆల్ ఇండియా స్థాయిలో 1542వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 52వ ర్యాంకు
- డెర్మటాలజీ సీటు సాధించడమే లక్ష్యంగా కృషి..
- 560 మార్కులతో సత్తా చాటిన కట్కూరి భావనారెడ్డి






**కుషాయిగూడ, మహా :** జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్షలో చర్లపల్లి డివిజన్ చక్రిపురం రెడ్డి కాలనీకి చెందిన డాక్టర్ కట్కూరి భావనారెడ్డి ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 1542వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 52వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ఆమె సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కుషాయిగూడ చక్రిపురం కు చెందిన చెందిన శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్ యజమాని కట్కూరి విజయకుమార్ రెడ్డి, సుధ దంపతుల కుమార్తె భావనారెడ్డి చదువుపై ప్రత్యేక ఆసక్తితో నీట్ పీజీ పరీక్షకు సన్నద్ధమయ్యారు. తనకు ఇష్టమైన డెర్మటాలజీ (చర్మవ్యాధుల వైద్యం) విభాగంలో పీజీ సీటు సాధించాలనే లక్ష్యంతో క్రమశిక్షణతో చదువుతూ, నిరంతరం సాధన చేశారు. ఇందులో భాగంగా గత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయడంతో పాటు మాక్ టెస్టులు రాశారు. ఈ కృషి ఫలితంగా 560 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 1542వ ర్యాంకు దక్కించుకున్నట్లు డాక్టర్ భావనారెడ్డి తెలిపారు. తన కుమార్తె జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు విజయ కుమార్ రెడ్డి, సుధ ఆనందం వ్యక్తం చేశారు. భావనా రెడ్డిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో వైద్యరంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**శ్రమతోనే లక్ష్యాన్ని చేరుకున్నా: డాక్టర్ భావనారెడ్డి**

తన విజయంపై డాక్టర్ భావనారెడ్డి మాట్లాడుతూ.. "నాకు ఇష్టమైన డెర్మటాలజీ విభాగంలో పీజీ సీటు సాధించాలనే లక్ష్యంతో శ్రమించాను. లక్ష్యాన్ని చేరుకునేందుకు పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేశాను. మాక్ టెస్టులు రాస్తూ పరీక్షకు సన్నద్ధమయ్యాను. ఈ సాధనతో 560 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 1542వ ర్యాంకు పొందానని తెలిపారు.



## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం..!

- జిల్లా అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీస్) కిరణ్మయి
- ప్రజావాణిలో అందిన 102 ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 102 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-49, ఇతర శాఖలు -53, మొత్తం 102 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

రాజేంద్రనగర్ మహా ; తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో కోలన్ రాధిక ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పద్మా దేవేందర్ రెడ్డి, సునీత రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా, మాజీ జెడ్పీటీసీ ఏనాగు మురళీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంచర్ల మమత శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. వేడుకల్లో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మల పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్, కె. శ్రీనివాస్, మహిళా అధ్యక్షులు పి. పరమేశ్వర్, కందకంట్ల సిద్ధు రెడ్డి, దీపా మల్లేష్, రాహుల్ అప్పా, యాలాల యుగేందర్ రెడ్డి, రాజేందర్, బాత్కు మహేష్‌యాదవ్,



గుంటి చరణ్, రాఘవేందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్స్ లో తొలిసారిగా**

## ట్రాకింగ్ అండ్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్

**రాజేంద్రనగర్ మహా ;** జీఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (గేల్ ), జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో తొలిసారిగా రియల్‌టైమ్ లాస్ట్ అండ్ ఫౌండ్ ట్రాకింగ్ అండ్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పోగొట్టుకున్న వస్తువుల గురించి ఫిర్యాదు చేయడం, వాటి స్థితిని తెలుసుకోవడం, తిరిగి పొందే ప్రక్రియ సాధ్యమవుతుంది. వస్తువుల వివరాలను నమోదు చేయడం, అభ్యర్థన స్థితిని ట్రాక్ చేయడం, ప్రయాణికులకు సమాచారం అందించడం వంటి సేవలను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. దీంతో ప్రయాణికులు తమ అభ్యర్థనల స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు, వస్తువులను తిరిగి పొందే ప్రక్రియలో ప్రతి దశలోనూ తాజా సమాచారాన్ని పొందవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత ప్రయాణికుల సేవలను మెరుగుపరచడం, వినియోగదారులకు మరింత మెరుగైన అనుభవాన్ని అందించాలనే శంషాబాద్ (హైదరాబాద్) విమానాశ్రయ నిబద్ధతకు నిదర్శనం.



## వైద్య ఆరోగ్యశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

**బిజెపి పార్టీ అండగా ఉంటుంది**

**బిజెపి నాయకులు తోకల**

**రాజేంద్రనగర్ మహా :** వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు వారు చేపట్టబోయే సమ్మెకు బీజేపీ తమ సంపూర్ణ మద్దతును తెలుపుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఇందిరా పార్కులో జరగబోయే ధర్నాకు మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంవత్సరాల తరబడి ఎట్టి చాగరి చేస్తున్న తమకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయించాలని వినతిపత్రం అందజేశారు.



### దామరపల్లి నర్సింహారెడ్డి ఇంట్లో

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు

**కుషాయిగూడ, మహా** : తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కుషాయిగూడ ద్వారకాపురి కాలనీలో దామరపల్లి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. దామరపల్లి లత, ఆమె కుమార్తె హర్షిని రెడ్డి తమ స్వహస్తాలతో గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మను పేర్చారు. అనంతరం బతుకమ్మ చుట్టూ చేరిన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో ద్వారకాపురి కాలనీ పూలవనాన్ని తలపించింది. తెలంగాణ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. ద్వారకాపురి కాలనీతో పాటు సమీపంలోని సోనియా గాంధీ నగర్, మధురానగర్, చక్రిపురం, మీనాక్షి నగర్, శుభోదయ కాలనీల్లోనూ మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సంప్రదాయాన్ని చాటుకున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ దామరపల్లి కుటుంబ సభ్యులు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# చీరకట్టులో బాంధవి శ్రీధర్



తెలుగు సినీ నటి బాంధవి శ్రీధర్ సంప్రదాయ చీరకట్టులో ఆకట్టుకుంటున్నారు. తనదైన శైలి, సహజమైన అందంతో ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ ఆధునికతను మేళవించిన తన లుక్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. చీరకట్టులో బాంధవి శ్రీధర్ చూపిస్తున్న హుందాతనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంప్రదాయ దుస్తులకు తగిన అలంకరణలు, చక్కటి మేకప్‌తో ఆమె లుక్ మరింత అందంగా కనిపిస్తోంది. సాధారణంగా కనిపించే చీరకట్టును కూడా తనదైన శైలిలో ప్రత్యేకంగా చూపిస్తూ ఫ్యాషన్ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో బాలనటిగా ప్రయాణం ప్రారంభించిన బాంధవి శ్రీధర్.. ఆ తర్వాత నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'మసూద' చిత్రంతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. నటనతో పాటు ఫొటోషూట్ల ద్వారా కూడా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సంప్రదాయ దుస్తుల్లోనూ స్టైలిష్‌గా కనిపించవచ్చని బాంధవి శ్రీధర్ లుక్ తెలియజేస్తోంది. చీరకట్టుకు ఉన్న ప్రత్యేకతను తన హుందాతనంతో మరింత ఆకర్షణీయంగా చూపిస్తున్నారు.



# పబ్లిసిటీకి దూరంగా రాజమౌళి

భారతీయ సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి మరోసారి తన సరళమైన వ్యక్తిత్వంతో ఆకట్టుకున్నారు. భారీ విజయాలు అందుకున్నప్పటికీ ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉండటం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది.అక్టోబర్ 10న రాజమౌళి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ ప్రేక్షకులు ఆయన నుంచి ప్రత్యేక ప్రకటన వస్తుందని ఆశించారు. ముఖ్యంగా మహేశ్‌బాబుతో తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమాకు సంబంధించి కొత్త పోస్టర్ లేదా కీలక అప్‌డేట్ విడుదలవుతుందని ఎదురుచూశారు. అయితే తన పుట్టినరోజును సినిమా ప్రచారానికి ఉపయోగించుకోకుండా ఆయన సాధారణంగానే గడపడం చర్చనీయాంశంగా మారింది. 'బాహుబలి', 'బాహుబలి 2', 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాలతో తెలుగు సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి.. తన పనితీరుతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయన దర్శకత్వంలో రూపొందే సినిమాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉంటాయి. అయినప్పటికీ వ్యక్తిగత వేడుకలను ప్రచార కార్యక్రమాలుగా మార్చుకోవడంపై ఆయన ఆసక్తి చూపకపోవడం ప్రత్యేకంగా కనిపిస్తోంది. మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా 'వారణాసి' చిత్ర బృందం ప్రత్యేక పోస్టర్లను విడుదల చేసింది. అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా సినిమా ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తోంది. అయితే దర్శకుడిగా తన పుట్టినరోజున మాత్రం ఎలాంటి ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టకపోవడం రాజమౌళి వైఖరిని తెలియజేస్తోంది. సినిమా విజయానికి ప్రచారం అవసరమే అయినప్పటికీ, సరైన సమయంలో ప్రేక్షకులకు సమాచారం అందించడం కూడా ముఖ్యమనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రచారం కంటే సినిమా నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం, పనితోనే తన ప్రత్యేకతను నిరూపించుకోవడం రాజమౌళి ప్రయాణంలో కనిపించే అంశాలు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినప్పటికీ సాధారణంగా ఉండటం, వ్యక్తిగత వేడుకల కంటే తన పనికి ప్రాధాన్యం ఇవ్వడం ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. అందుకే రాజమౌళి పుట్టినరోజు సందర్భంగా ఆయన సాధారణత, వినమ్రత మరోసారి సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించాయి.

## రాజస్థాన్ పర్యటనలో

# పలక్ తివారీ సందడి

బాలీవుడ్ నటి పలక్ తివారీ రాజస్థాన్ పర్యటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి అందాలు, స్థానిక సంస్కృతి, సంప్రదాయ సంగీతం, ఆహార రుచులను ఆస్వాదిస్తూ ఆమె తన పర్యటనలోని మధుర క్షణాలను అభిమానులతో పంచుకున్నారు. రాజస్థాన్‌లోని ప్రకృతి అందాల మధ్య గడిపిన సమయాన్ని పలక్ తన ఫొటోల ద్వారా చూపించారు. అటవీ ప్రాంతాల సందర్శన, సరస్సు ఒడ్డున ఫొటోలు, స్థానిక సంగీతానికి సంబంధించిన క్షణాలు ఈ పర్యటనలో ప్రత్యేకంగా నిలిచాయి. పర్యటనలో భాగంగా అక్కడి ఆహారాన్ని ఆస్వాదించడంతో పాటు రాజస్థానీ సంస్కృతిని దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించినట్లు ఆమె పోస్టుల ద్వారా వెల్లడైంది. రాజస్థాన్ ఆతిథ్యం, అక్కడి సంప్రదాయాలు తనను ఆకట్టుకున్నాయని పలక్ పేర్కొన్నారు. స్థానిక సంస్కృతిలోని ప్రత్యేకతలు, సంగీతంలోని మాధుర్యం, ఆహారంలోని విభిన్న రుచులు తనకు మంచి అనుభూతిని అందించాయని ఆమె వెల్లడించారు. ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షించడంతో పాటు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ఈ పర్యటన ఫొటోలపై కొందరు అభిమానులు ఇబ్రహీం అలీ ఖాన్ పేరును ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరూ కలిసి పర్యటనకు వెళ్లి ఉంటారంటూ కొందరు ఊహాగానాలు వ్యక్తం చేశారు. అయితే ఈ పర్యటనలో ఇబ్రహీం అలీ ఖాన్ కూడా ఉన్నారనే విషయంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. పలక్ తివారీ ప్రముఖ టెలివిజన్ నటి శ్వేతా తివారీ కుమార్తె. సంగీత వీడియోల ద్వారా గుర్తింపు పొందిన ఆమె, సల్మాన్ ఖాన్ నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' చిత్రంతో బాలీవుడ్‌లో నటిగా పరిచయమయ్యారు. సినిమాలతో పాటు సోషల్ మీడియా పోస్టుల ద్వారా కూడా అభిమానులకు చేరువవుతున్నారు. రాజస్థాన్ పర్యటనలోని అందమైన క్షణాలను పంచుకోవడంతో పలక్ తివారీ మరోసారి వార్తల్లో నిలిచారు.



# చేనేత కార్మికుడిగా సుహాస్.. కొత్త సినిమా ప్రోమో విడుదల

విభిన్న కథలను ఎంచుకుంటూ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న సుహాస్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన నటిస్తున్న కొత్త సినిమాకు 'హైడ్ అండ్ సిల్క్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన టైటిల్ ప్రోమో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. చేనేత వృత్తిని ఆధారంగా చేసుకుని ఈ చిత్ర కథను రూపొందించినట్లు ప్రోమోను బట్టి తెలుస్తోంది. ఇందులో సుహాస్ చేనేత కార్మికుడి పాత్రలో కనిపించనున్నారు. నూలు నుంచి అందమైన చీరను తయారు చేసే ప్రక్రియతో పాటు, ఆ పని వెనుక ఉండే శ్రమ, కళాకారుడి భావోద్వేగాలను కథలో చూపించనున్నట్లు సమాచారం. తాను నేసిన చీరను ధరించే అమ్మాయిని చూడాలనే యువకుడి కోరిక కథకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రంలో సంజనా కృష్ణమూర్తి కథానాయికగా నటిస్తుండగా, తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించనున్నారు. చేనేత నేపథ్యంలో ప్రేమ, అనుబంధాలు, భావోద్వేగాలను కలగలిపి కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రోమో సూచిస్తోంది. రాజేంద్ర బాల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత్ రామ్‌నాథ్ సంగీతాన్ని అందిస్తున్నారు. స్టోన్ బెంచ్ స్టూడియోస్, మిశ్రీలాల్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.విభిన్నమైన కథాంశాలతో సినిమాలు చేస్తున్న సుహాస్.. ఈసారి చేనేత వృత్తి నేపథ్యంలో సాగే ప్రేమకథతో ప్రేక్షకులను పలకరించనున్నారు. టైటిల్ ప్రోమోతో ఆసక్తి పెంచిన ఈ సినిమా విడుదల తేదీ, ఇతర వివరాలపై ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.





# సీఎం విజయ్‌తో విజయ్ దేవరకొండ, రష్మిక భేటీ

తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు దళపతి విజయ్‌ను టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మందన్న కలిశారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలను విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ భేటీ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యమంత్రి విజయ్‌తో జరిగిన సమావేశం తనకు మంచి అనుభూతిని ఇచ్చిందని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. బిజీగా ఉన్నప్పటికీ తమకు సమయం కేటాయించి ఆప్యాయంగా మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో మాట్లాడిన తర్వాత మరింత గౌరవం పెరిగిందని, ఆయన వ్యక్తిత్వం తనను ఆకట్టుకుందని వెల్లడించారు. రష్మిక మందన్న కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గతంలో విజయ్‌తో కలిసి సినిమాల్లో నటించిన అనుభవం ఉన్న ఆమె.. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఉండటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించిన 'రణబాలి' చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 16న విడుదల కానుంది. సినిమా ప్రచార కార్యక్రమాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com